RNI APTEL/25/A0798

# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంపుటి : 1 సంచిక:41 31-7-2025 గురువారం ఎడిటర్ :మర్రి పవీన్ పేజీలు : 8 వెల 4 /-

## సింధూ జలాలు ఇవ్వం



న్యూఢిల్లీ,జూలై 30 (టుడే విదుర): పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాక్‌పై భారత్ విధించిన ఆంక్షల్లో భాగంగా నిలిపివేసిన సింధూ నదీ జలాల ఒప్పందం పై కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ రాజ్యసభలో బుధవారంనాడు స్పష్టత ఇచ్చారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని శాశ్వతంగా విడిచిపెట్టేంతవరకూ నదీ జాలల ఒప్పందం నిలుపుదలలోనే ఉంటుందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పినట్టుగా నీరు, రక్తం కలిసి ప్రవహించవని ఆయన పునరుద్ఘాటించారు. సింధూ జలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేయడం ద్వారా నెహ్రూ చేసిన తప్పిదాన్ని మోదీ ప్రభుత్వం సరిచేసిం దన్నారు.'నెహ్రూ నేతృత్వంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దలేమని ఆరు దశాబ్దాలుగా చెబుతూ వచ్చారు. కానీ వాటిని మార్చవచ్చని మోదీ ప్రభుత్వం చేసి చూపించింది. ఆర్టికల్ 370ను రద్దు చేశాం. ఇప్పుడు సింధూ జలాల ఒప్పందాన్ని సరిదిద్దుతున్నాం' అని జైశంకర్ చెప్పారు. అప్పటి నెహ్రూ ప్రపంచం శాంతి కోసం కాకుండా బుజ్జగింపు విధానాలతో సింధూ జలాల ఒప్పందంపై సంతకాలు చేశారని తప్పుపట్టారు. మోదీ ప్రభుత్వ ప్రయత్నాల వల్లే ఉగ్రవాదం అనేది ఇవాళ్ల గ్లోబల్ ఎజెండా అయిందని జైశంకర్ చెప్పారు. ఫైనాన్సియల్ యాక్షన్ టాస్క్ ఫోర్క్ ద్వారా పాకిస్థాన్‌పై భారత్ ఒత్తిడి తీసుకురాగలిగిందని, అంతర్జాతీ భద్రతా మండలిలో భారత్‌కు సభ్యత్వం లేకున్నా లష్కరే తొయిబా ప్రాక్సీ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)పై ఆంక్షలు విధించేందుకు యూఎన్‌ను ఒప్పించగలిగిందని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి తనపనేనంటూ టీఆర్ఎఫ్ ప్రకటించుకోవడాన్ని మంత్రి గుర్తు చేశారు.

## సింగపూర్ పర్యటన పూర్తి..




అమరావతి,జూలై 30 (టుడే విదుర): సింగపూర్‌లోని తెలుగు ప్రజల ఆత్మీయ స్వాగతం.. ప్రేమాభిమానాలు మరువలేనని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సింగపూర్ పర్యటన ముగించుకుని బుధవారం సీఎం చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్‌కు బయలుదేరారు. అంతకు ముందు ఆయన బస చేసిన హోటల్‌కు సింగపూర్‌లోని తెలుగు ప్రజలు భారీ ఎత్తున తరలి వచ్చారు. వారితో ఆయన ముచ్చటించారు. సింగపూర్ నుంచి బుధవారం రాత్రి 10.30 గంటలకు హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్ పోర్టుకు ఆయన చేరుకోనున్నారు. ఆ వెంటనే ప్రత్యేక విమానంలో ఎయిర్ పోర్ట్ నుంచి విజయవాడకు బయల్దేరి వెళ్లనున్నారు. రాత్రి 11.30 గంటలకు సీఎం చంద్రబాబు ఉండవల్లిలోని నివాసానికి చేరుకోనున్నారు.

నాలుగు రోజుల్లో..

నాలుగు రోజుల పాటు 26 సమావేశాలతోపాటు వివిధ కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు.

ఇంకా సింగపూర్‌లోనే..

అయితే సింగపూర్‌లోనే ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి. నారాయణ పర్యటన కొనసాగుతోంది. బుధవారం ఉదయం సింగపూర్‌లోని ఎస్‌జే సంస్థ (సుర్బానా జురాంగ్) కార్యాలయాన్ని మంత్రి నారాయణతోపాటు సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు సందర్శించారు. ఈ సందర్భంగా అమరావతిలో సూక్ష్మ స్థాయిలో పచ్చదనం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఆ సంస్థ ప్రతినిధులతో వీరు చర్చించారు.

## ప్రభుత్వ గుర్తింపు కార్డుతో మహిళలు ఉచిత బస్సులో ప్రయాణించవచ్చు : ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల



గుంటూరు,జూలై 30 (టుడే విదుర) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఏదో ఒక ఐడీ కార్డుతో మహిళలు బస్సులో ఉచితంగా ప్రయాణించవచ్చని చెప్పారు. బుధవారం గుంటూరులోని ఎన్టీఆర్ బస్ స్టేషన్‌లో 'మహిళలకు ఉచిత బస్సు' పథకం సన్నద్ధతపై ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావుతో కలిసి ఎపిఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ సమీక్ష నిర్వహించారు. ఈ పథకంలో ఎదురయ్యే సవాళ్లు, సమస్యలు, సన్నద్ధతపై డిపో మేనేజర్లకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర మహిళల జీవితాల్లో మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా సిఎం చంద్రబాబు ఉచిత బస్సు పథకానికి శ్రీకారం చుడుతున్నారని అన్నారు. ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి వచ్చే ఉచిత బస్సు సర్వీసు ద్వారా మహిళలు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చని తెలిపారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌తోపాటు నగరాల్లోని మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ సర్వీసుల్లో కూడా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని చెప్పారు. వచ్చే క్యాబినెట్ సమావేశం అనంతరం దీనిపై అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశముందన్నారు.

## ఏపీలో చిప్ డిజైన్ సెంటర్ ఏర్పాటు చేయండి.. గూగుల్‌ను కోరిన మంత్రి లోకేష్



అమరావతి,జూలై30(టుడే విదుర): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చిప్ డిజైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. గూగుల్ క్లౌడ్ డైరెక్టర్ డ్రూ బ్రైన్స్‌తో మంత్రి లోకేష్ ఇవాళ(బుధవారం) సింగపూర్‌లో భేటీ అయ్యారు. ఈ సదర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడారు. విశాఖపట్నంలో డేటా సిటీని ఏర్పాటు చేసేందుకు గూగుల్ సంస్థ గత ఏడాది డిసెంబర్ 11వ తేదీన ఏపీ ప్రభుత్వంతో గూగుల్ ఎంఓయూ చేసుకుందని గుర్తుచేశారు. ఏపీలోని యువతను ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) వినియోగాన్ని ప్రోత్సహించడానికి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడానికి గూగుల్‌తో మరో ఎంఓయూ చేసుకుందని చెప్పుకొచ్చారు మంత్రి నారా లోకేష్.విశాఖపట్నంలో డేటా సిటీకి అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ పూర్తిచేశామని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. సాధ్యమైనంత త్వరగా గూగుల్ డేటా సెంటర్ పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. గూగుల్ తన సర్వర్ల కోసం సొంత చిప్‌లను రూపొందిస్తున్నందున వైజాగ్‌లోని ప్రతిపాదిత డేటా సెంటర్ క్యాంపస్‌లో చిప్ డిజైనింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని కోరారు. గూగుల్ క్లౌడ్ ప్రపంచంలోనే అతిపెద్ద డాటా సర్వర్ వినియోగదారుల్లో ప్రధానమైందని ఉద్ఘాటించారు మంత్రి నారా లోకేష్.

## తప్పు చేసాను క్షమించండి : పార్థసారథి రెడ్డి




అమరావతి,జూలై30(టుడే విదుర):టీడీపీ క్రమశిక్షణ కమిటీ ముందుకు పులివెందుల టీడీపీ నేత పార్థసారథి రెడ్డి హాజరయ్యారు. క్రమశిక్షణ కమిటీ నేతలు పల్లా శ్రీనివాస్, వర్ల రామయ్య, కొనకళ్ళ నారాయణలకు పార్థసారథి వివరణ ఇచ్చారు. ఇక నుంచి పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి నడుచుకుంటానని, దయచేసి క్షమించమని కమిటీని కోరారు. టీడీపీ అగ్ర నేతలపై తాను చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్తున్నానని కమిటీ ముందు వేడుకున్నారు.ప్రస్తుతం పార్థసారథి రెడ్డి ఆంధ్రప్రదేశ్ టీడీపీ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఇటీవల సోషల్ మీడియాలో పార్టీ అగ్ర నేతలకు వ్యతిరేకంగా పార్థసారథి రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో దుమారం లేపాయి. దీంతో ఆగ్రహించిన టీడీపీ అధిష్ఠానం క్రమశిక్షణ సంఘం ముందుకు హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో (బుధవారం) పార్థసారథి రెడ్డి క్రమశిక్షణ సంఘం ముందుకు హాజరై వివరణ ఇచ్చారు.

## ఖాతాల్లోకి నగదు ఎప్పుడంటే.. గుడ్ న్యూస్ చెప్పిన మంత్రి అచ్చెన్న

అమరావతి,జూలై 30 (టుడే విదుర): వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. బుధవారం అమరావతిలో ఆయన మాట్లాడుతూ.. గత జగన్ రెడ్డి ప్రభుత్వం మూడేళ్ల పాటు రైతులకు ఒక్క రూపాయికే బీమా అంటూ ప్రచారం చేసినా.. వాస్తవానికి నామమాత్రపు బీమా కూడా అమలు చేయకుండా రైతులను వంచించిందని విమర్శిం చారు. రాష్ట్ర వాటా ప్రీమియాన్ని చెల్లించక పోవడం తో రూ.3,138 కోట్ల బీమా క్లెయిమ్లు పెండింగ్‌గా మారాయన్నారు. దీంతో రైతులకు నష్టాలు తప్ప లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో బీమా చెల్లించామని అబద్ధం చెప్పిన జగన్.. పార్టీ అధినేత చంద్రబాబు నిరసనకు దిగిన తర్వాతే రూ. 590 కోట్ల నగదు విడుదల చేసి తూతూ మంత్రంగా వ్యవహరించారని ఆరోపించారు.

## ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ మొదటి విడత నిధులు విడుదల : శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి



ప్రకాశం,జూలై 30 (టుడే విదుర) : మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మార్కాపురం మండలంలోని దరిమడుగు గ్రామంలో పంట పిచికారి డ్రోన్ యంత్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల కష్టాలు ఏంటో తెలుసుకున్నారని అన్నారు. ఒక ఎకరాకు మామూలుగా పురుగుమందు పిచికారి చేయాలంటే దాదాపు రోజు సమయం తీసుకుంటుందని, అదే పనిని డ్రోన్ నిమిషాలలో పూర్తి చేస్తుందని తెలిపారు. తద్వారా రైతులకు శ్రమ తగ్గుతుందని అధిక దిగుబడులకు అవకాశం ఉంటుందని అన్నారు. ఈ డ్రోన్ల ద్వారా కొంత నిరుద్యోగ సమస్య కూడా తీరుతుందని వారికి ఉపాధి కూడా లభిస్తుందని తెలిపారు. ఆగస్టు 2వ తేదీన అన్నదాత సుఖీభవ పథకం ద్వారా దాదాపు 46 లక్షల మంది రైతులకు సంవత్సరానికి 20000 రూపాయలు గాను మొదటి విడతగా వారి అకౌంట్లో 7 వేల రూపాయలు నిధులు జమ చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, యువ నాయకులు నారా లోకేష్ బాబుకి, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు లకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం డ్వాక్రా మహిళలకు పెరటి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ %% ఈ పెరటి విత్తనాల ద్వారా ఇంటి వద్ద పెరట్లోనే వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు పండించుకోవచ్చు అని తద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో దరిమడుగు రైతు సోదరులు, తెలుగుదేశం నాయకులు, డ్వాక్రా మహిళలు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ప్రకాశం బ్యారేజీకి భారీ వరద.. ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశాలు



విజయవాడ,జూలై30(టుడే విదుర): విజయవాడలోని ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద నీరు పోటెత్తుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో కృష్ణా నదిలోకి భారీగా వరదనీరు చేరుతోంది. దీంతో బ్యారేజీ నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచనలు నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి సత్య ప్రసాద్ సూచించారు.

# సరిహద్దు చెక్ పోస్టులను తొలగించాలి

## ఏపీ లారీ ఓనర్స్ సంఘం డిమాండ్.. తమిళనాడులో ధర్నా

విజయవాడ సిటీ, జూలై 30 (టుడే విదుర): తమిళనాడు రాష్ట్ర సరిహద్దులో అనధికారికంగా కొనసాగుతున్న చెక్ పోస్టులను ఎత్తివేయాలని ఆంధ్రప్రదేశ్ లారీ యజమానుల సంఘం ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఈ చెక్ పోస్టులను తొలగించాలంటూ.. ఆంధ్రా-తమిళనాడు సరిహద్దులోని గుమ్మడిపూ డి చెక్ పోస్ట్ వద్ద ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ధర్నా చేసింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 70 మంది లారీ యజమానులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఏపీ సహా కొన్ని రాష్ట్రాలు సరిహద్దు చెక్‌పోస్టులను తొలగించాయన్నారు. తమిళనాడు సహా మరికొన్ని రాష్ట్రాలు




వీటిని అనధికారికంగా కొనసాగిస్తున్నాయని చెప్పారు. అనధికారికంగా ఉన్న చెక్ పోస్టులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

# శంషాబాద్ కాచారంలో పట్టుబడ్డ 11 కోట్ల వ్యవహారంలో ట్విస్ట్



విజయవాడ, జూలై 30 (టుడే విదుర): హైదరాబాద్ శంషాబాద్‌లోని కాచారంలో సిట్ జరిపిన తనిఖీల్లో పట్టుబడ్డ 11 కోట్ల వ్యవహారంలో ట్విస్ట్ చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న 1 రాజ్ కేసిరెడ్డి తనకు ఆ డబ్బుతో ఎలాంటి సంబంధం లేదని ఏసీబీ కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. సిట్ సీజ్ చేసిన 11 కోట్ల రూపాయల నగదుతో తనకు ఏ మాత్రం సంబంధం లేదని స్పష్టం చేశారు.ఆ నగదు తనదిగా చిత్రీకరించి, తనకు బెయిల్ రాకుండా చేయడం కోసం సిట్ ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. లిక్కర్ స్కాంలో విచారణ జరుగుతుండగా, సిట్ అనవసరంగా తనపై ఆరోపణలు చేస్తోందని పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలో సిట్ వర్గాలు రాజ్ కేసిరెడ్డికి వ్యతిరేకంగా మరిన్ని ఆధారాలు సేకరిస్తుండగా, అతని బెయిల్ పిటిషన్‌పై కోర్టు త్వరలోనే విచారణ చేపట్టనుంది.

# ఆ జిల్లాల ప్రజలకు బిగ్ అలర్ట్




అమరావతి, జూలై 30 (టుడే విదుర): భారీ వర్షాలు, ఎగువ నుంచి వస్తున్న వరద నీటి ప్రవాహంతో విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది పరవళ్లు తొక్కుతోంది. దీంతో బుధవారం బ్యారేజీ వద్ద 3 లక్షల క్యూసెక్కుల నీరు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో బ్యారేజీ నుంచి నీటికి దిగువకు విడుదల చేయాలని వారు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ స్పందిస్తూ.. ప్రజలకు కీలక సూచనలు చేశారు. కృష్ణా నదిలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నందున నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కృష్ణా నదిలో ప్రయాణించ వద్దని చెప్పారు. వరద నీటిలో ఈతకు వెళ్ళడం కానీ, చేపలు పట్టడం వంటి పనులు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. అలాగే జంతువులను నదిలో వదిలేయ వద్దని చెప్పారు.

# రాష్ట్రమంతా ఉచిత ప్రయాణం

## మహిళలకు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో, సిటీ సర్వీసుల్లో అవకాశం

## మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు వెల్లడి





తిరుపతి(ఆర్టీసీ), జూలై 30 (టుడే విదుర): 'ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కింద మహిళలు రాష్ట్రమంతటా.. ఎక్కడి నుంచి ఎక్కడికైనా తిరగొచ్చు. దీనిపై ఎలాంటి పరిమితి లేదు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో, సిటీ సర్వీసుల్లో మాత్రమే ఉచిత ప్రయాణం చేయొచ్చు' అని రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు తెలిపారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపై తిరుపతిలోని సంస్కృత విద్యాపీఠం కాన్ఫరెన్స్ హాల్లో రాయలసీమ జోన్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. పథకం అమలుపై డీపీటీవోలు, సీటీఎంలు, సీఎంఈలు, డిపో మేనేజర్లకు దిశానిర్దేశం చేశారు. దీనికి సంబంధించి త్వరలోనే తుది మార్గదర్శకాలు వెలువరిస్తామని చెప్పారు. అనంతరం మంత్రి, ఆర్టీసీ ఎండీ మీడియాతో మాట్లాడారు. ఈ పథకం అమలుతో ప్రస్తుతం బస్సుల్లో తిరుగుతున్న మహిళల సంఖ్య 35శాతం నుంచి సుమారు 60శాతానికి పెరగవచ్చని అంచనా వేశామని వివరించారు. రద్దీకి తగ్గట్లు బస్సుల నిర్వహణ, కండిషన్‌ను మరింత మెరుగుపరిచే చర్యలు చేపట్టాలని, ట్రిప్పుల సంఖ్య పెంచాలని అధికారులను ఆదేశించామని అన్నారు. త్వరలో 1,050 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని, ఇవి కాకుండా దాదాపు 1,500 బస్సులకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. సిబ్బంది కొరతను అధిగమించే మార్గాలు చూడాలని, బస్సు కండిషన్‌లో ఉంటేనే రోడ్డెక్కించాలని స్పష్టంగా చెప్పామన్నారు. అందరూ సమన్వయం చేసుకొని పథకం అమలుకు సహకరించాలని కోరారు. తిరుమల ఘాట్ విషయంలో ప్రభుత్వం త్వరలో ఓ నిర్ణయం తీసుకుంటుందని, ఇందులో తాము కల్పించుకోలేమని మంత్రి, ఈడీ చెప్పారు. సమావేశంలో ఆర్టీసీ ఈడీలు ఎ.అప్పలరాజు, చెంగల్‌రెడ్డి, చంద్రశేఖర్, జగదీష్, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

# కరేడు రైతులకు ఎకరాకు రూ.20లక్షలు




నెల్లూరు,జూలై 30 (టుడే విదుర): : నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు ప్రాంతంలో ఇండోసోల్ పరిశ్రమకు చేపడుతున్న భూసేకరణ ప్రక్రియలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సుమారు వంద ఎకరాలకు సంబంధించిన రైతులు, ఇండోసోల్ ప్రతినిధులు, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు రాత్రి నెల్లూరులో కలెక్టర్ ఆనంద్‌తో చర్చించారు. పరిహారం పెంపు, ఉపాధి కల్పనపై సుదీర్ఘంగా చర్చించారు. భూసేకరణ చట్టం ప్రకారం ఎకరాకు రూ.12.50 లక్షలు పరిహారంగా ఇచ్చేలా ఇది వరకే నిర్ణయించారు. అయితే ఆ మొత్తాన్ని రూ.20 లక్షలకు పెంచేలా నిర్ణయం తీసుకున్నారు. ఇక ఈ భూముల్లో హార్టికల్చర్, ఆక్వాకల్చర్ సాగు ఉంటే అదనంగా ఎకరాకు రూ.3 లక్షల నుంచి 5 లక్షల వరకూ ఇవ్వనున్నారు. అలాగే కరేడు ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుతో 30 వేల ఉద్యోగాల సృష్టి జరుగుతుందని, అందులో కనీసం 6 వేల ఉద్యోగాలు స్థానికులకు దక్కుతాయని కూడా కలెక్టర్ రైతులకు వివరించారు. భూములు కోల్పోయిన ప్రతీ కుటుంబానికి ఒక ఉద్యోగం దక్కుతుందని తెలిపారు. దీంతో రైతులు సానుకూలంగా స్పందించారు. రూ.20 లక్షల చొప్పున ధర ఇస్తే భూములు ఇచ్చేందుకు అభ్యంతరం లేదని రైతులు అధికారులకు చెప్పినట్లు సమాచారం. ఈ చర్చలపై కలెక్టర్ ఆనంద్ 'తో మాట్లాడుతూ స్వచ్ఛందంగా భూములు ఇచ్చేందుకు ముందుకొచ్చిన రైతులకే ఈ ధర వర్తిస్తుందని స్పష్టం చేశారు. రైతులతో చర్చించేందుకు తామెప్పుడూ సిద్ధంగానే ఉన్నామని వెల్లడించారు.

# కింగ్‌డమ్ సినిమా కోసం మరమ్మతులు.. భారీ అగ్ని ప్రమాదం..



నెల్లూరు, జూలై 30 (టుడే విదుర):కావలి పట్టణంలోని స్రవంతి థియేటర్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. హీరో విజయ్ దేవరకొండ కింగ్‌డమ్ సినిమా రిలీజ్ కోసం థియేటర్‌లో మరమ్మతులు చేస్తుండగా అగ్ని ప్రమాదం సంభవించినట్లు థియేటర్ నిర్వాహకులు తెలిపారు. వెంటనే సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది థియేటర్ వద్దకు చేరుకుని మంటలను అదుపు చేశారు.అగ్ని ప్రమాదం కారణంగా ప్రొజెక్టర్ రూమ్, ఫర్నిచర్, స్క్రీన్ దగ్ధం అయినట్లు థియేటర్ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.అగ్నిప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి థియేటర్ యజమానులను పరామర్శించారు. నిర్వాహకులతో మాట్లాడి ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. కొత్త సినిమా రిలీజ్‌ల సందర్భంగా థియేటర్ వద్ద చేస్తున్న కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు జాగ్రతగా ఉండాలని ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి సూచించారు.

# హెచ్‌ఎం సారు.... మందు కొట్టి వచ్చారు!




కమలాపురం రూరల్, జూలై 30 (టుడే విదుర):పాఠశాలను క్రమశిక్షణలో నిర్వహించాల్సిన ప్రధానోపాధ్యాయుడే గతి తప్పాడు. ఫుల్లుగా తాగేసి పాఠశాలకు వచ్చాడు. విషయం తెలిసి కలెక్టర్ అతడిని సస్పెండ్ చేశారు. వైఎస్సార్ కడప జిల్లా కమలాపురం మండలం పెద్దచెప్పలి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓబుల్‌రెడ్డి ఫుల్లుగా మద్యం సేవించి మత్తులో తూగుతూనే పాఠశాలకు వచ్చాడు. కుర్చీలో కూర్చుని టేబుల్‌మీద తలపెట్టుకుని పడుకున్నాడు. మద్యం మత్తులో తూగుతున్న ప్రధానోపాధ్యాయుడిని మీడియా ప్రశ్నించగా మద్యం తాగడం తప్ప తాను వేరే తప్పు చేయలేదని సమర్థించుకున్నాడు. ఆయన రోజూ తాగేసి పాఠశాలకు వస్తారని ఇతర ఉపాధ్యాయులు తెలిపారు. అందరూ కలసి ఆయనను పాఠశాల నుంచి నుంచి పంపించేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎంఈవో అక్కడికి వెళ్లి విచారణ చేపట్టారు. ఉపాధ్యాయులను పిలిపించి ఒక్కొక్కరి అభిప్రాయాలను లిఖితపూర్వకంగా తీసుకున్నారు. కాగా.. కమలాపురం మండలం పెద్దచెప్పలి హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు ఓబుల్‌రెడ్డి మద్యం తాగి పాఠశాలకు వెళ్లిన విషయం మీడియాలో రావడంతో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆయనను సస్పెండ్ చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేయాలని డీఈవో ఆదేశించారు.

# గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు సాంకేతికతను వినియోగించాలి

అమరావతి, జూలై 30 (టుడే విదుర): కేంద్ర, రాష్ట్ర విభాగాల సమన్వయంతో గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర స్థాయి రెండో త్రైమాసిక నార్కో కోఆర్డినేషన్ టీమ్ (ఎన్సీఓఆర్డీ) సమావేశం సీఎస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ... 'గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా



ఉండేందుకు యువతకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలి. వీటి నియంత్రణకు ఈగల్ టీమ్ పెద్ద ఎత్తున సాంకేతికతను వినియోగించాలి. ఉత్తరాంధ్రలో గంజాయి సాగు నియంత్రణకు సాంకేతికతను వినియోగిస్తున్నారు. గంజాయికి బదులు కాఫీ, సిల్వర్ ఓక్ వంటి మొక్కలను అందించి, గిరిజనుల జీవనోపాధికి తోడ్పడటం అభినందనీయం'అని అన్నారు. డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ, గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు అంతర రాష్ట్ర చెక్‌పోస్టులను పటిష్ఠం చేయాల్సి ఉందన్నారు. ఈగల్ చీఫ్ రవికృష్ణ మాట్లాడుతూ, ఇప్పటి వరకు 911 కేసులు నమోదు చేసి, గంజాయి, వాహనాలను పట్టుకున్నట్లు వివరించారు.

# తీవ్రంగా ఎండ.. బలహీనంగా రుతుపవనాలు



విశాఖపట్నం,జూలై 30 (టుడే విదుర): రాష్ట్రంలో రుతుపవనాలు పూర్తిగా బలహీనపడ్డాయి. బంగాళాఖాతం నుంచి తేమగాలులు భూ ఉపరితలంపైకి రావట్లేదు. అదే సమయంలో పడమర దిశ నుంచి వేడి గాలులు వీస్తున్నాయి. దీంతో ఉదయం నుంచే ఎండ తీవ్రంగా ఉంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3నుంచి 5డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. జంగమ హేశ్వరపురంలో 37 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24గంటల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురుస్తాయని, మిగిలిన ప్రాంతాల్లో ఎండ తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. మరో మూడు, నాలుగు రోజులు ఎక్కువ ప్రాంతాల్లో పొడి వాతావరణం ఉంటుందని పేర్కొంది.

# ఉద్యోగుల గౌరవం కోసం పోరాటం

గుంటూరు(తూర్పు), జూలై 30 (టుడే విదుర): ఉద్యోగుల ప్రయోజనాలు సాధించే విషయంలో ఎట్టి పరిస్థితులలో రాజీ పడబోమని ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ స్పష్టం చేశారు. గుంటూరు ఏపీ ఎన్‌జీవో సంఘ సాంస్కృతిక సమావేశ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ...ఉద్యోగులకు రావల్సిన జీపీఎఫ్, ఏపీ జీఎల్ఐ, సరెండర్ లీవ్ బకాయిలను కొంత మేరకు కూటమి ప్రభుత్వం చెల్లించిందని మిగతా వాటిని సాధించేందుకు రాష్ట్ర నాయకత్వం కృషి చేస్తోందన్నారు. బకాయిలు కంటే ఉద్యోగుల గౌరవం కోసం సంఘం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. జీపీఎఫ్, సరెండర్ లీవులు, ఈహెచ్ఎస్ ఇతర సేవలు కింద రూ. 1850 కోట్ల కోసం ప్రతి ఏడాది ఆయా కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి



మారాలన్నారు. గత బకాయిలను తొలి దశలో దాదాపు రూ. 7వేల కోట్లను విడుదల చేయటం, పెన్షనర్లకు అదనపు క్యాంటమ్ పెన్షన్ ఇవ్వాలనే ప్రభుత్వ నిర్ణయాలు హర్షించదగ్గ విషయమన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ మాట్లాడుతూ ఉద్యోగ నాయకుల సమష్టి కృషితో తాము ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు సాధించుకుంటామని చెప్పారు. తొలుత భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే నసీర్ అహమద్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు

# ఒడిశా టూ.. ముంబై

%ఇచ్ఛాపురం, జూలై 30 (టుడే విదుర):ఒడిశా నుంచి గంజాయిని ముంబై తరలిస్తుండగా ఇచ్ఛాపురంలో ఓ వ్యక్తి అరెస్ట య్యాడు. ఈ మేరకు పోలీసులు 34.3 కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇచ్ఛాపురంలోని సర్కిల్ కార్యాలయంలో సీఐ మీసాల చిన్నంనాయుడు పట్టణ ఎస్ఐ ముకుంద రావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీఐ కథనం మేరకు.. ఒడిశాలోని గంజాం జిల్లా ఖరియాగూడ ప్రాంతానికి చెందిన సంతు న్ దాసు రైతుల వద్ద 34.3 కిలోల గంజాయిని కొనుగోలు చేశాడు. దాన్ని ముంబై లోని మలాడ్ ప్రాంతంలో ఉంటున్న లొబొకుండ అనే వ్యక్తికి విక్రయించేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో ఒడిశా నుంచి



ద్విచక్ర వాహనంపై ఇచ్ఛాపురం చే రుకున్నాడు. గంజాయి తరలిస్తున్నట్లు పట్టణ ఎస్ఐ ముకుందరావుకు సమాచా రం అందింది. దీంతో ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ రెండో ఫ్లాట్ ఫారం, ఎల్‌సీ గేటు వద్ద తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో రెండు లగేజీ బ్యాగులతో 18 గంజాయి ప్యాకెట్లతో బైక్‌పై సంతున్ దాసు వస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. గంజాయిని సీజ్ చేసి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

# నాసిరకం మందుల తయారీ కంపెనీ యజమానికి జైలు



శ్రీకాకుళం, జూలై 30 (టుడే విదుర): నాసిరకం మందుల తయారు చేస్తున్న కంపెనీ యజమాని మనోజ్‌కుమార్ రాంబల్‌కు ఒక రోజు జైలు, రూ.50వేలు జరీమానాను విధిస్తూ శ్రీకాకుళం అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కేఎం జమృత్ బేగమ్ తీర్పునిచ్చారు. జిల్లా ఔషధ నియంత్రణ పరిపాలన సహాయ సంచాలకులు చంద్రరావు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళంలో 2017 అక్టోబరు 10న ఓ మందుల దుకాణంలో విటమిన్-ఏ పీడీయాట్రిక్ ఓరల్ సొల్యూషన్ (చిన్నపిల్లలకు నోటిలో వేసే మందు)ను నమూనాలను జిల్లా ఔషధ నియంత్రణ అధికారులు సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించారు. ఆ ఓరల్ సొల్యూషన్‌లో ప్రామాణికాలు లోపించాయని నిర్ధారణ అయింది. దీంతో ఈ మందు తయారు చేసిన కంపెనీ సన్‌రైజ్ ఇంటర్‌నేషనల్ ల్యాబ్స్ లిమిటెడ్ యజమాని మనోజ్‌కుమార్ రాంబల్‌పై కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి కోర్టులో కేసు విచారణ జరుగుతోంది. సీనియర్ ఏపీపీ పి.సుశీల కోర్టులో వాదనలు వినిపించారు. ఈ మేరకు ముద్దాయి మనోజ్‌కుమార్ రాంబల్ తన నేరాన్ని అంగీకరించారు. జిల్లా వ్యాప్తంగా తరచూ మందుల నమూనాలను సేకరిస్తున్నామని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా ఔషధ నియంత్రణ పరిపాలన సహాయ సంచాలకులు చంద్రరావు అన్నారు. ఔషధ చట్టం ఉల్లంఘనలపై జిల్లాలో 44 కేసులు నమోదు చేశామని, కోర్టుల్లో విచారణ జరుగుతోందని స్పష్టం చేశారు.

# తొలగిన అడ్డంకులు

## తాళభద్ర ఎల్‌సీ గేటు వైపు చురుగ్గా సాగుతున్న కంచె నిర్మాణ పనులు

## తాళభద్ర-నర్సిపురం రహదారికి మార్గం సుగమం

## హద్దులు గుర్తించి కంచె వేస్తున్న రైల్వేశాఖ

జూలై 30 (టుడే విదుర):నెరవేరనున్న దశబ్దాల నాటి కలడి 25 ఏళ్లు అవుతున్నా తాళభద్ర-నర్సిపురం ప్రజల చిరకాలవాంఛ పక్కా రహదారికి అనేక ఆంక్షలు అడ్డొచ్చాయి. ఈ రహదారి పలాస రైల్వే స్టేషన్ సమీపంలో ఉండడంతో పాటు పూర్తిగా రైల్వేశాఖ పరిధిలోకి రావడంతో మున్సిపల్ అధికా రులు రహదారి నిర్మాణాన్ని చేపట్టలేకపోయారు. అప్పటి కేంద్రమంత్రిగా పనిచేసిన దివంగతనేత కింజరాపు ఎర్రన్నాయుడు సైతం రహదారి కోసం పోరాడి రైల్వేశాఖ ఆంక్షలు కారణంగా చేతులు ఎత్తేశారు. ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఉన్న కింజ రాపు రామ్మోహన్‌నాయుడు దృష్టికి ఈ రోడ్డు సమ స్య తీసుకువెళ్లినా.. ఆయన సైతం మౌనం దాల్చా ల్సిన పరిస్థితి వచ్చింది. ఎట్టకేలకు రైల్వే అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మూడో రైల్వేలైన్ నిర్మిస్తు న్న నేపథ్యంలో పక్కాగా హద్దులు గుర్తించాల్సి వచ్చింది. దీంతో పాటుగా మొత్తం రైల్వే భూములకు రక్షణగా పక్కా గోడల నిర్మాణానికి శ్రీకారం చు ట్టారు. అందులో భాగంగా తాళభద్ర ఎల్‌సీ గేటు నుంచి కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వరకూ సుమారు రెండు కిలోమీటర్ల పొడవునా కంచె నిర్మాణం పనులు చురుగ్గా సాగుతు న్నాయి. మరో నెలలో మొత్తం పనులన్నీ పూర్తయ్యే అ వకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో తాళబద్ర- నర్సిపురం రహదారి మ రోమారు తెరపైకి వచ్చిం ది. ఈ రహదారి నిర్మా ణం జరిగితే రెండు గ్రా మాలకు లింకు రోడ్డు ఏ ర్పడడంతో పాటు వజ్రపుకొత్తూరు



మండలవా సులకు కాశీబుగ్గ రోడ్డును దాటకుండా పాత జా తీయ రహదారి మీదుగా శ్రీకాకుళం, విశాఖ వంటి దూరప్రాంతాలకు వెళ్లడానికి మార్గం ఏర్పడుతుం ది. దీంతో గంటల కొద్ది గేటువద్ద వేచి ఉండకుండా రెండు రైల్వేగేట్లు తగలకుండా వెళ్లడానికి వీలవు తుంది. గతంలో మున్సిపాలిటి అధికారులు రహ దారి నిర్మాణం చేపట్టడానికి చర్యలు తీసుకున్నా రైల్వేశాఖ అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఆ పనులు వెనక్కు మళ్లాయి. ప్రస్తుతం రైల్వేశాఖ తమ పరిధిలో భూములకు రక్షణ గోడ నిర్మాణం చేపట్టి నర్సిపురం-తాళభద్ర రహదారిని విడిచిపె ట్టింది. దీంతో పక్కా రహదారి ఏర్పాటు చేయడా నికి మార్గం సుగమం కావడంతో ప్రజలు పక్కా రహదారికోసం ఎదురుచూస్తున్నారు. 24 అడుగుల వెడల్పుమేరకు రహదారి నిర్మించడానికి అవకాశా లు ఉండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు ప్రత్యేక ఆర్థిక నిధులు వెచ్చించి ఈ రహదారికి మోక్షం కల్పించాలని ఆ యా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

# వసతి గృహాల్లో ట్యూటర్ల నియామకానికి చర్యలు



జి.సిగడాం, జూలై 30 (టుడే విదుర):వసతి గృహాల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు ఆగస్టు ఒకటినుంచి ట్యూటర్స్‌ను నియమిం చేలా చర్యలు తీసుకుంటున్నట్లు రణస్థలం ఏబీసీడబ్ల్యూవో జి.చంద్రమౌళి తెలి పారు.జి.సిగడాం, సంతవురిటి బీసీ బాలుర వసతి గృహాలను తనిఖీచేశారు.ఆయన వెంట వసతి గృహ సంక్షేమాధికారులు లోలుగు నూకరాజు, టి అప్పారావు, సిబ్బంది ఉన్నారు.

# స్వచ్ఛభారత్‌లో స్వయం సహాయక సంఘాలు



అమరావతిజూలై 30 (టుడే విదుర): స్వచ్ఛభారత్‌లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఘనవ్యర్థాల నిర్వహణకు డ్వాక్రా సంఘాల సేవలు వినియోగించుకోవాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది. పైలట్ ప్రాజెక్టు కింద 10 జిల్లాలను ఇప్పటికే ఎంపిక చేసింది. పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, వైఎసఆర్ కడప జిల్లాల్లోని ఒక్కో పంచాయతీని ఎంపిక చేసి ఈ పైలట్ ప్రాజెక్టు చేపట్టనున్నారు. చెత్త సేకరణ, తడి, పొడి చెత్తగా విడగొట్టడం, కంపోస్టింగ్ తదితర ప్రక్రియపై స్వయం సహాయక సంఘాలకు అవగాహన కల్పించనున్నారు. ఘనవ్యర్థాల నిర్వహణలో భాగంగా వర్మి కంపోస్టును ఉత్పత్తి చేసి మార్కెట్ చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మార్గదర్శకాల్లో సూచించారు.

# అప్పు చెల్లిస్తారా లేక మేము..
# కాల్ మనీ గ్యాంగ్ వేధింపులు




%అనంతపురంజూలై 30 (టుడే విదుర):: ఉమ్మడి అనంతపురం జిల్లాలో కాల్ మనీ అరాచకాలు రోజురోజుకూ శ్రుతిమించిపోతున్నాయి వీ. మొన్న అనంతపురం, నేడు ధర్మవరంలో వెలుగుచూశాయి వడ్డీ వ్యాపారుల ఆకృత్యాలు. అనంతపురం నగరంలోని పాత ఊరిలో బంగారం వ్యాపారి బాబ్ జాన్‌ను చితకబాదారు వడ్డీ వ్యాపారులు. రూ.2 లక్షల అప్పుకు నెలకు రూ. 20 వేల వడ్డీ చెల్లించారు వ్యాపారి బాబ్ జాన్. ధర్మవరంలో వడ్డీ చెల్లించలేదని చేనేత కుటుంబంపై దాడి చేశారు వడ్డీ వ్యాపారి అనుచరులు.వడ్డీ వ్యాపారి ఎర్రగుంట రాజా నుంచి రూ.6 లక్షలు అప్పు తీసుకున్నారు పట్టు చీరల వ్యాపారం చేస్తున్న రమణ. వ్యాపారం కోసం వారానికి రూ.10ల వడ్డీ చొప్పున అప్పు తీసుకున్నారు రమణ. మూడు నెలలుగా వడ్డీ చెల్లించకపోవడంతో ఈనెల(జులై) 23వ తేదీన పట్టు చీరల వ్యాపారి రమణ ఇంటిపైకి వడ్డీ వ్యాపారి ఎర్రగుంట రాజా దాడికి వచ్చారు. ఇంట్లోకి ప్రవేశించి రమణతోపాటు భార్య భారతిపై విచక్షణ రహితంగా దాడి చేశారు వడ్డీ వ్యాపారి అనుచరులు. తల్లిదండ్రులను కొడుతుండటంతో అడ్డుగా వెళ్లిన కుమారుడు చరణ్ సాయిపై విచక్షణారహితంగా దాడి చేశారు వడ్డీ వ్యాపారి అనుచరులు. వారు లక్షలు అప్పు తీసుకొని రూ.15 లక్షలు వడ్డీ కట్టినా.. మరో రూ. 6 లక్షల ఇవ్వాలని బెదిరిస్తున్నారంటూ రమణ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రశ్నార్థకంగా పంటకాల్వలు



బెల్లగడ పంట కాల్వలో తుంగ పెరిగిన దృశ్యం

పోరుమామిళ్ల, జూలై 30 (టుడే విదుర):రియల్ఎస్టేట్ రంగంతో పంట కాల్వల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. పంట పొలాలకు సకాలంలో సక్ర మంగా నీరందించాలన్న ఉద్దేశ్యంతో గతంలో ఏర్పాటు చేసిన పంటకాల్వలు రానురాను కుదించుకుపోవడమే కాకుండా కొన్నిచోట్ల ఆక్రమణలతో వాటి జాడేలేకుండా పోతోంది. పంట కాల్వల మరమ్మత్తులు చేపట్టకపోవడం, ఆక్ర మణలకు గురైన వాటిపై చర్యలు తీసుకోకపోవడంతో అసలు కాల్వలు ఎక్క డ ఉన్నాయా? అని పరిశీలించుకోవాల్సిన సరిస్థితి ఏర్పడింది. పోరుమామిళ్ల చెరువు ఆయకట్టు సుమారు 4400 ఎకరాలు కాగా అనధికారికంగా దాదాపు పదివేల ఎకరాలకు సాగునీరు అందించే సామర్థ్యం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. ఈ చెరువు కింద గతంలో వెడల్పాటి పంట కాల్వలు ఉండి రంగసముద్రం రెడ్డికతవ, మల్లకతవ ప్రాంతాలకు పూర్తిస్థాయిలో నీరందేది. కానీ ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ వెంచర్ల కోసం కాల్వలను పూడ్చడమో అధికార దర్పం చూపడంతో వాటిని పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. పోరుమామిళ్ల చెరువు నుంచి బుగ్గబావి, ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న కాల్వల ద్వారా రంగసముద్రం చెరువులోకి నీరు అందేది. ప్రస్తుతం ఆ పరిస్థితి కానరావడంలేదు. కొందరు గృహ నిర్మాణాల కోసం ఈ పంట కాల్వలు కూడా పూడ్చివేయడంతో నీరు కింది చెరువులకు అందే పరి స్థితి లేకండాపోయింది. అంతేకాకుండా పోరుమామిళ్ల చెరువు నుంచి దమ్మన పల్లె మీదుగా మల్లకతవ, బెల్లగడ కాల్వకు రంగసముద్రం చెరువుకు గతం లో నీరందేది. ప్రస్తుతం ఆ కాల్వలన్నీ పూడిపోయి పిచ్చిమొక్కలు కనిపిస్తు న్నాయి. బెల్లగడ కాల్వకు సమీపంలో వ్యర్థాలు పడవేయడంతో పూర్తిగా కాలువ అంతా కలుషితమైపోయింది. కాల్వలన్నీ పూడిపోవడంతో వర్షం నీరు ఎటు వెళ్లాలో తెలియక రోడ్లపైనే నిల్వ ఉంటూ ప్రజలకు ఇబ్బంది కలిగి స్తోంది. గతంలో వర్షాలు వచ్చినప్పుడు ఆర్టీసీ బస్టాండు ఆవరణమంతా నీటి కుంటను తలపించేలా ఉండేవి. అదే కాలవలు సక్రమంగా ఉంటే పడిన వర్షమంతా కాల్వల ద్వారా వెళితే సమస్య ఉ ఒడేది కాదు. అంతేకాక ఆర్టీసీ బస్టాండు దేశాయి ?థియేటరు వెనుక వైపు ఉన్న పంట పొలాలు రియల్ ఎస్టేట్ భూములుగా మారడంతో ఆ పంట కాల్వలన్నీ ఒకటో, రెండో కాల్వలు తప్ప మిగతావి కానరాని పరిస్థితి. ఇప్పటికైనా పాలకులు సంబంధిత అధికా రులు పంట కాలవలను సర్వే చేసి గతంలో ఉన్న పంట కాల్వలను పునరుద్ధ రించి పంట పొలాలకు చెరువులకు నీరందించే విధంగా చర్యలు తీసుకో వాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.


# 80 శాతం రాయితీతో కిసాన డ్రోన్లు

చిన్నమండెం,జూలై 30 (టుడే విదుర):మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ అధ్యక్షతన చిన్నర్సుపల్లె గ్రామం రైతు రవీంద్ర శ్రీరామ గ్రూప్‌కు 80 శాతం రాయితీతో క్రిసాన డ్రోన్లను అందించారు. డ్రోన వినియోగంతో సమయం ఆదా అవుతుందన్నారు. ఇది ప్రభు త్వం రైతులకు ఇచ్చే గొప్పవరమని దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. తొక్కట లేకుండా పిచికారీ చేసుకోవచ్చునని, మందులు సైతం తక్కువ మోతాదులో పడతాయని వారు వివరించారు. ఏడీఏ శ్రీలత,



యూనియన బ్యాంక్ మేనేజర్ పెద్దిరెడ్డెయ్య, ఏవో గీత, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# అయ్యా.. నే బతికే ఉండా



కేవీబీపురం జూలై 30 (టుడే విదుర)::తహసీల్దారు కార్యాలయం వద్ద దీనంగా నిలబడి ఉన్న ఈమె పేరు జమృతాబీ. వయసు 55 ఏళ్లు. ఓబూరు గ్రామం. ఆమె ఆధార్ నెంబరును కంప్యూటరులో ఎంట్రీ చేస్తే.. చనిపోయినట్లు చూపుతోంది. దీంతో రేషన్ కార్డు పోయింది. పింఛనూ రావడం లేదు. సారూ, నేను బతికే ఉన్నానంటూ నాలుగేళ్లుగా ఆమె కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వాళ్లు లేరు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన పొరబాటు ఈమెను ముప్పుతిప్పలు పెట్టిస్తోంది. వీరి కుటుంబ రేషన్ కార్డులో యజమానురాలుగా జమృతాబీ ఫొటో ఉ ంది. ఈమె అత్త జైనాబీ పేరు పెట్టారు. నాలుగేళ్ల కిందట జైనాబీ మృతిచెందారు. అప్పట్లో జైనాబీ పేరుకు జమృతాబీ ఆధార్‌ను లింక్ చేసి చనిపోయినట్లు రికార్డుల్లోకి ఎక్కించారు. అప్పట్నుంచి తాను బతికే ఉన్నానని చెప్పుకొనేందుకే జమృతాబీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. రేషన్‌కార్డు అడుగుతున్నారు. పింఛను వస్తే తన జీవితం గడిచిపోతుందని ఆమె ఆశ. గతనెల 24వ తేదీన తిరుపతిలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలోనూ ఆమె తన పరిస్థితి వివరిస్తూ ఉన్నతాధికారులకు అర్జీ ఇచ్చారు. 'భర్త లేదు. ఏ అండాలేని తనకు రేషన్‌కార్డు, పింఛు ఇచ్చి ఆదుకోండి' అంటూ మొర పెట్టుకున్నారు. సమస్యను పరిష్కరించి కార్డు ఇప్పించండంటూ కలెక్టరేట్ నుంచి మండల అధికారులకు చెప్పినా సమస్య పరిష్కారం కాలేదు. మళ్లీ ఈ నెల14న ఆమె కలెక్టరేట్‌కు వెళ్లి అర్జీ ఇచ్చారు. నాటికంతా సమస్యను పరిష్కరించి న్యాయం చేస్తామని చెప్పారు. వచ్చింది.. వీఆర్వో వచ్చి సమస్యను పరిష్కరించామంటూ ఆమె వద్ద సంతకం తీసుకున్నారు. కానీ సమస్య పరిష్కారం కాలేదు. తహసీల్దారు కార్యాలయం వద్ద ఆమె తన గోడు వెల్లబోసుకున్నారు.

# పదో తరగతి విద్యార్థినికి గర్భం..
# పాఠశాల కరస్పాండెంట్‌పై పోక్సో కేసు



రాయవరం, జూలై 30 (టుడే విదుర): :పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిని లోబర్చుకుని గర్భవతిని చేసిన కరస్పాండెంట్‌పై పోక్సో కేసు నమోదు అయ్యింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలంలోని ఓ గ్రామంలోని ప్రైవేటు ఫౌండేషన్ స్కూల్ కరస్పాండెంట్ ఎ.షాజీ జయరాజ్ ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడు. 10వతరగతి బాలికపై కన్నేసి కొన్ని నెలల క్రితం బెదిరించి గర్భవతిని చేశాడు. బాలిక తల్లిదండ్రులు ఈనెల 28న రాయవరం పోలీసులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు పర్యవేక్షణలో జ యరాజ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్టు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు. ఆ ఫౌండేషన్ స్కూల్‌ను కోనసీమ జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం బాషా తనిఖీ చేశారు. 8,9,10 తరగతులు అనుమతులు లేకుండా ఏ విధంగా నిర్వహిస్తున్నారు అనే విషయాన్ని డీఈవో ఆరా తీశారు. పాఠశాల యాజమాన్యంపై సమగ్రమైన దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బాలిక కుటుంబ సభ్యులను కలిసి సంఘటనపై ఆరా తీశారు. డీఈవోతో పాటు ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, సీఐ దొరరాజు, ఎస్ఐ సురేష్ బాబు, ఐసీడీఎస్ అధికారులు బాలిక కుటుంబ సభ్యులను కలిసి విచారణ జరిపారు. కాగా కరస్పాండెంట్ జయరాజ్ పరారీలో ఉన్నా డు. అతడి కోసం పోలీసులు వెతుకుతున్నారు.

# కుక్కల దాడిలో 12 మేకల మృతి
## రూ.1.5 లక్షల ఆస్తి నష్టం

రాయదుర్గం జూలై 30 (టుడే విదుర): అనంతపురం జిల్లా గుమ్మగట్ట మండలం టి.కోనాపురం గ్రామంలో ఓబులేష్ కు చెందిన దొడ్డివామిలో రాత్రి కుక్కలు దాడి చేయడం వల్ల 12 మేకలు మృతి చెందాయి. లక్ష యాభై వేల రూపాయలు నష్టం జరిగింది అని ఓబులేష్ తెలిపారు. అధికారులు, ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు.



# లోగ్రేడ్.... నోబిడ్

**పొగాకు మార్కెట్లో భారీగా తిరస్కరణలు**
**%దక్షిణాదిలో సగటున మూడో వంతు**
**టంగుటూరులో ఏకంగా సగం నోబిడ్**



ఒంగోలు, జూలై 30 (టుడే విదుర):పొగాకు మార్కెట్లో నోబిడ్ బేళ్లు భారీగా ఉంటున్నాయి. దక్షిణాది వేలం కేంద్రాల్లో మూడో వంతు వరకు తిరస్కరణకు గురయ్యాయి. టంగుటూరులో మంగళవారం ఏకంగా అక్కడికి వచ్చిన బేళ్లలో సగానికి పైగా నోబిడ్ అయ్యాయి. ప్రత్యేకించి ఆయా వేలం కేంద్రాల్లో లోగ్రేడ్ బేళ్లను కొనేందుకు బయ్యర్లు ఏమాత్రం ముందుకు రావడం లేదు. దీంతో వాటిని అధికారులు నోబిడ్ చేస్తున్నారు. దక్షిణాదిలోని 11 వేలం కేంద్రాల్లో అమ్మకాలకు మొత్తం 8,856 బేళ్లను అధికా రులు అనుమతించారు. అందులో 5,040 బేళ్లను మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేయగా 3,816 తిరస్కరణకు గురయ్యాయి. అంటే అమ్మకాలకు తెచ్చిన బేళ్లలో సుమారు 43శాతంను కొనుగోలు చేయలేదు. అలా తిరస్కరణకు గురైన 3,816 బేళ్లలో అధికా రులు సూచించిన ధరకు కొనేందుకు బయ్య ర్లు ముందుకు రాక 2,837 (32.03శాతం) నోబిడ్ అయ్యాయి. టంగుటూరు కేంద్రంలో ఏకంగా 50.36శాతం ఉన్నాయి.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



చోద్యం (అనకాపల్లి) :జూలై 30 (టుడే విదుర): మండలంలో పప్పు శెట్టిపాలెం జంక్షన్‌కు సమీపంలో మలుపు వద్ద జరిగిన బైక్ ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. మండలంలో చోద్యం గ్రామానికి చెందిన పైల ప్రభాకర్ (33) నర్సీపట్నం నుండి రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో చోద్యం కు వస్తుండగా మార్గమధ్యంలో పప్పిశెట్టిపాలెం జంక్షన్ సమీపంలో మలుపు వద్ద కుక్క అడ్డుగా రావడంతో ప్రభాకర ప్రయాణిస్తున్న బైకు అదుపుతప్పి రోడ్డుపైన పడిపోయాడు. తల భాగంలో ముఖంపై తీవ్ర గాయాలు కావడంతో గ్రామస్తుల సహకారంతో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం పంపించారు. గాయాలు తీవ్రంగా ఉండడంతో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి వారు వైజాగ్ కే జి హెచ్ కు సిఫార్సు చేయగా అంబులెన్స్ లో బయలుదేరా సమయంలోనే ప్రభాకర్ మఅతి చెందాడు.

# ఎల్లమ్మ తల్లి దేవాలయంలో ఓడి బియ్యం ప్రసాద వితరణ



సుల్తానాబాద్ రూరల్,జూలై 30 (టుడే విదుర): గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో నాగుల పంచమిని పురస్కరించుకొని ఓడి బియ్యంతో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుల్తానాబాద్ మండల కేంద్రంలోని గౌడ కులస్తులు గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రావణ మాసంలో పెద్ద సంఖ్యలో ఇంటికి ఓ బోనంతో మహిళలు బోనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పోచమ్మ తల్లి, రేణుక ఎల్లమ్మ తల్లి అమ్మవార్లకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి పోసిన ఓడి బియ్యంతో నైవేద్యం సమర్పించి తిరుగు వారం నిర్వహించారు. ఎల్లమ్మ తల్లికి ప్రసాదం సమర్పించిన అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నేతలు జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అంతటి అన్నయ్య గౌడ్, గౌడ కులస్తులు పుష్పలత, మంద శ్రీనివాస్ గౌడ్, గడ్డం అంజయ్య గౌడ్, పొన్నం తిరుపతి గౌడ్, కొయ్యడ శ్రీనివాస్ గౌడ్, కెక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, కొయ్యడ రమేష్ గౌడ్, కరుణాకర్ గౌడ్, మంద శివ గౌడ్, బత్తిని కృష్ణ గౌడ్, శ్రీనివాస్ గౌడ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు

# గిరిజన పాఠశాల విద్యార్థిని అనుమానాస్పద మృతి



ఖమ్మం రూరల్, జూలై 30 (టుడే విదుర): గిరిజన పాఠశాల విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ ఘటన ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలో సాయంత్రం చోటుచేసుకుంది. అదే పాఠశాలలో చదువుతున్న సహా విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గొల్లగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో కూసుమంచి మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన భూక్య ప్రతిమ పదో తరగతి చదువుతుంది. ఆమె పాఠశాలలో సాంఘిక శాస్త్రం కు సంబంధించిన ఎఫ్ఏ వన్ పరీక్ష రాస్తూ ఒక్కసారిగా కండ్లు తిరిగి కిందపడిపోయింది. గమనించిన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు వెంటనే వైద్య కోసం ఖమ్మం నగరంలోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో విద్యార్థిని మృతి చెందింది. విషయం తెలిసిన బాలిక తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆస్పత్రి ముందు ఆందోళనకు దిగారు. విద్యార్థిని ప్రతిమ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

# కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ వర్సిటీలో ఆగస్టు నుంచి తరగతులు!

## 'దోస్త్' వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ

## పీజీ కోర్సులూ ఈ ఏడాది నుంచే ప్రారంభం



%కొత్తగూడెం ఎడ్యుకేషన్, జూలై 30 (టుడే విదుర): దేశంలోనే మొదటి ఎర్త్ సైన్సెస్ (భూ విజ్ఞాన శాస్త్రం) యూనివర్సిటీని రాష్ట్ర ప్రభు త్వం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కొత్తగూడెంలో ఏర్పాటు చేసింది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో అంతకుముందున్న మైనింగ్ ఇంజనీరింగ్ కళాశాలను ఎర్త్ సైన్స్ వర్సిటీగా అప్‌గ్రేడ్ చేసి.. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన మాజీ ప్రధాని దివంగత మన్మోహన్ సింగ్ పేరు పెట్టింది. ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు ఇచ్చేందుకు 'దోస్త్' వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానించింది. ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు. మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయిస్తారు. బీఎస్సీలో జియాలజీ, జియోఫిజిక్స్, జియోకెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ కోర్సులతో పాటు పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులు కూడా ఈ ఏడాది నుంచే ప్రారంభించనున్నారు.ఒక్కో విభాగం లో బీఎస్సీలో 60, పీజీలో 40సీట్లు ఉన్నాయి. ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా పీజీ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు. ప్రస్తుతం ఎర్త్ సైన్సెస్ కోర్సులన్నీ దేశంలో ఎక్కడా ఒకే వర్సిటీలో ఎక్కడా లేవు. ఈ కోర్సులకు దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఎర్త్ సైన్సెస్ వర్సిటీ 312 ఎకరాల్లో ఏర్పాటవుతోంది. రూ.500 కోట్లతో సదుపాయాలు కల్పిస్తున్నారు. మొద టి ఏడాది ఏ కోర్సుల్లో ఏ సబ్జెక్టులు ఉండాలనే అంశంపై వివిధ వర్సిటీల అధ్యాపకులతో చర్చించారు. ఆగస్టులో తరగతులు ప్రారంభమవుతాయని విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, వైస్ చాన్సలర్ యోగితా రాణా తెలిపారు. బీఎస్సీ కోర్సుల్లో అడ్మిషన్ ఫీజు రూ.19,500 వరకు ఉంటుందని, స్కాలర్‌షిప్ లభిస్తుందని ప్రిన్సిపాల్ జగన్ మన్మోహన్‌రాజు చెప్పారు.

# మాసాయిపేట రైలు దుర్ఘటనపై నాలుగో తరగతిలో పాఠ్యాంశం

## తోటివారి ప్రాణాలు కాపాడిన సాహస బాలిక గాథ




రామయంపేట, జూలై 30 (టుడే విదుర): నాలుగో తరగతి పాఠ్యాంశంలో మాసాయిపేట మానని గాయాన్ని చేర్చారు ఉపాధ్యాయులు. 11 ఏళ్ల క్రితం జరిగిన రైలు ప్రమాదంలో రుచిత అనే చిన్నారి చేసిన సాహసాన్నీ ఈ పాఠ్యాంశంతో గుర్తు చేశారు. 16 మంది చిన్నారుల ప్రాణాల్ని చిదిమేసిన ఈ దుర్ఘటనను తెలుగు పుస్తకంలో 'తెలుగు సాహస బాల – రుచిత' అన్న శీర్షికతో ముద్రించి విద్యార్థులకు బోధిస్తున్నారు. 2014 జూలై 24న మెదక్ జిల్లా మాసాయిపేట రైల్వే క్రాస్ వద్ద.. పట్టాలపై ఆగి ఉన్న స్కూల్ బస్సును, నాందేడ్ వెళ్తోన్న రైలు ఢీకొంది.ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్ సహా 16 మంది అభం శుభం తెలియని పిల్లలు మృత్యుశకటానికి బలయ్యారు. అప్పట్లో ఈ ఘటన దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ప్రమాదం ఓ సాహస బాలికను వెలుగులోకి తీసుకు వచ్చింది. ఒకరినొకరు కాపాడుకోలేని అచేతన స్థితిలో కూడా.. ఇద్దరు తోటి వారి ప్రాణాలు కాపాడింది రుచిత అనే చిన్నారి. రైలు దగ్గరగా వ స్తోందని గమనించిన రుచిత, బస్సు ముందుకు కదలకపోవడంతో వెంటనే ఇద్దరు పిల్లల్ని కిటికీలోంచి తోసేసి, తాను దూకేసింది. రుచిత సాహసాన్ని గుర్తించిన భారత ప్రభుత్వం సాహస బాలికగా గుర్తించి సత్కరించింది.

# విద్యార్థులకు మెరుగైన విద్య బోధనను అందించాలి




ఓదెల, జూలై 30 (టుడే విదుర):పెద్దపల్లి జిల్లా ఓదెల మండల విద్యా వనరుల కేంద్రంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఇందులో విద్యార్థుల యుడైస్ నమోదు, ఎఫ్ఆర్ఎస్ ఇతర ఆన్‌లైన్ ఆక్టివిటీస్, ఆన్ గోయింగ్ యాక్టివిటీస్ పైన చర్చించారు. అలాగే పాఠశాలల విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయుల సర్దుబాటు అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై ఉ పాధ్యాయులకు సూచనలు సలహాలు ఇచ్చారు. పాఠశాలల్లో పని చేస్తున్న స్కావెంజర్లకు జీతాలు, మధ్యాహ్న భోజనం తదితర అంశాలపై సమీక్ష జరిపారు. పాఠశాలల్లో నిర్వహించవలసిన రికార్డులు రిజిస్టర్లు, ఏఏపీసీలో భాగంగా పాఠశాల వసతులు మెరుగుపరుచుకోవాలని సూచనలు చేశారు. ఈ సమావేశం ఎంఈఓ రమేష్ అధ్యక్షతన జరగగా, పోత్కాపల్లి, ఓదెల కాంప్లెక్స్ హెచ్ఎంలు సాంబయ్య, లక్ష్మీనారాయణ, సీఆర్పీలు, ఎంఆర్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 9న భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు యాత్ర





హైదరాబాద్:జుజూలై 30 (టుడే విదుర): ఉత్తర భారత దేశంలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రాలను దర్శించుకోవడానికి సెప్టెంబర్ 9న భారత గౌరవ్ టూరిస్ట్ రైలు యాత్ర నిర్వహిస్తున్నట్లు ఇండియన్ రైల్వే సౌత్ స్టార్ రైల్ అండ్ టూర్ టైమ్స్ డైరెక్టర్ విగ్నేష్ తెలిపారు.బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రైలుయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాత్ర రైలు చెన్నూ నుంచి బయలుదేరి ఏపీలోని గూడూరు, నెల్లూరు ఒంగోలు, చీరాల, గుంటూరు, తెలంగాణలోని మిర్యాలగూడ, నల్గొండ,%హైదరాబాద్ కాజీపేట రైల్వే స్టేషన్లలో ఆగుతుందని, ప్రయాణికులు ఈ రైల్వే స్టేషన్లలో రైలు ఎక్కవచ్చని తెలిపారు. ఉజ్జయిని, ఓంకారేశ్వర్, ద్వారకా, సిద్దాపూర్, మథుర, అయోధ్య, ప్రయాగ్‌రాజ్, వారణాసీ, గయా వంటి పవిత్ర పుణ్యక్షేత్రాలను దర్శించుకోవచ్చని ఆయన తెలిపారు. 9355021516 ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేసి టికెట్లు కొనవచ్చునని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టూర్ టైమ్స్ జనరల్ మేనేజర్ సంతోష్, మేనేజర్ యాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# సెకండ్ హ్యాండ్ ఫోన్ కొంటున్నారా? జర జాగ్రత్త!





హైదరాబాద్, జూలై 30 (టుడే విదుర): కొంచెం తక్కువ ధరకు వస్తుందని చాలామంది సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లు కొంటుంటారు. అయితే, సెకండ్ హ్యాండ్ ఫోన్లను కొనేటప్పుడు ప్రజలు పాటించాల్సిన కొన్ని జాగ్రత్తలను సూచిస్తూ తెలంగాణ పోలీసులు ఎక్స్ వేదికగా హెచ్చరిక జారీ చేశారు. తెలియని వారు ఎవరైనా తక్కువ ధరకే ఫోన్ అమ్ముతానంటే అనుమానించాల్సిందేనని, చోరీకి గురైన ఫోన్ మీకు అమ్మవచ్చని హెచ్చరించారు. చిన్న జాగ్రత్తతో సెకండ్ హ్యాండ్ ఫోన్లను కొనుగోలు చేయవచ్చని, ఆ ఫోన్ ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ (ఐఎంఈఐ) నంబర్ తీసుకుని దానిని సంచార్ సాథీ.జీఓవి.ఇన్‌లోకి వెళ్లి స్టేటస్ చెక్ చేసుకోవాలని సూచించారు. సంచార్ సాథీ యాప్ లేదా వెబ్‌సైట్‌లోకి వెళ్లిన తర్వాత సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) ద్వారా మీరు కొనబోతున్న ఫోన్ ఐఎంఈఐ నంబర్ టైప్ చేసి వారు సూచించిన నంబర్‌కు ఎస్ఎంఎస్ పంపిస్తే క్షణాల్లో ఆ ఫోన్ బ్లాక్ లిస్టులో ఉందా? లేదా? అనే విషయం తెలిసిపోతుందని పోలీసులు వివరించారు.

# 31న గురుకుల ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు



హైదరాబాద్, జూలై 30 (టుడే విదుర): గురుకుల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఇంటర్మీడియట్ కోర్సులకు సంబంధించిన సీట్లకు ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి తెలిపారు. బుధవారం నుంచి వెబ్‌సైట్‌లో ఖాళీ సీట్ల జాబితా అందుబాటులో ఉంటుందని తెలిపారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలను పారదర్శకంగా మెరిట్ ఆధారంగా భర్తీ చేసినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో వర్షిణి మీడియాతో మాట్లాడారు. గురుకుల పాఠశాలల్లో 5 నుంచి 9వ తరగతి వరకు ఉన్న అన్ని సీట్లు భర్తీ అయ్యాయని ఆమె తెలిపారు. సంక్షేమ గురుకులాల్లో పిల్లలకు నాణ్యమైన పోషకాహార భోజనాలు అందించడానికి కేంద్రీకృత కొనుగోలు విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని తెలిపారు.గురుకుల వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఈఏపీసెట్–2025లో అర్హత సాధించిన విద్యార్థినులు ఈ నెల 30 నుంచి ఆగస్టు 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి బడుగు సైదులు తెలియజేశారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



# టుడే వినోదం

## తెలుగులో.. రిషబ్ షెట్టి పీరియడ్ డ్రామా!

## ఫస్ట్ లుక్ అదిరింది




టాలీవుడ్‌లో మరో ఆసక్తికర చిత్రానికి తెర లేచింది. కన్నడ నటుడు కాంతార స్టార్ రిషబ్ షెట్టి హీరోగా స్ట్రెయిట్ తెలుగులో ఓ కొత్త చిత్రం తెరపైకి వస్తోంది. టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్ టైన్ మెంట్స్ నాగవంశీ నిర్మిస్తోన్న ఈ చిత్రానికి రాజమౌళి శిష్యుడు ఆకాశ వాణి ల మూవీ ఫేం అశ్విన్ గంగరాజు దర్శకత్వం వహించనున్నాడు. %ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ అధికారిక ప్రకటన చేస్తూ బుధవారం ఓ పోస్టర్ రిలీజ్ చేశారు. ఇంకా టైటిల్ ఖరారు చేయని ఈ మూవీకి ది ల్యాండ్ బర్న్డ్ ఎ రెబల్ రోజ్ అనే క్యాప్షన్ ఇచ్చారు. 18 వ శతాబ్ధంలో బెంగాల్‌లో జరిగిన తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల బ్యాగ్రౌండ్‌లో హిస్టారికల్ పీరియడ్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కనుంది.ఇదిలాఉంటే ప్రస్తుతం రిషబ్ తెలుగులో ప్రశాంత్ వర్మ జై హనుమాన్‌లో నటిస్తోండగా ఛత్రపతి శివాజీ చిత్రాల్లో నటిస్తున్నాడు. అంతేగాక ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకున్న కాంతార చాప్టర్ 1 మరో నెల పదిహేను రోజుల్లో థియేటర్లలోకి రానుంది.

## ఆగస్టు 23న.. అనిరుధ్ ‘హుకుం’!

### టికెట్లకు భారీ డిమాండ్




రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సారథ్యంలో ‘హుకుం’ ) పేరుతో భారీ సంగీత విభావరి ఆగస్టు 23వ తేదీ జరుగనుంది. నగర శివారు ప్రాంతమైన ఈస్ట్ కోస్ట్ రోడ్ (ఈసీఆర్), కూవత్తూరులో ఉన్న ‘మార్గ్ స్వర్ణభూమి’ అనే ప్రాంతంలో జరుగనుంది.%గతంలో ఈసీఆర్‌లో జరిగిన ఏఆర్ రెహ్మాన్ సంగీత కచ్చేరి గందరగోళంగా మారిన నేపథ్యంలో అనిరుధ్ తన సంగీత కచ్చేరికి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. విశాలమైన స్థలంలో వేలాది మంది సంగీత అభిమానుల భద్రత, పార్కింగ్ ఇత్యాది సౌకర్యాలపై నిర్వాహకులు ప్రత్యేక దృష్టిసారించారు. ఈ మ్యూజిక్ కచేరికి సంబంధించి టిక్కెట్ల విక్రయం ఆగస్టు 4వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమవుతుందని నిర్వాహకులు అధికారికంగా వెల్లడించారు.అయితే ఈ షోకు సంబంధించి టికెట్లకు తమిళనాడు నుంచే గాక ఇతర రాష్ట్రాల నుంచి భారీ డిమాండ్ ఏర్పడింది. గతంలో రెండు మూడు దఫాలుగా నిర్వహించిన కన్సర్ట్‌లకు మాములుగా రూ.1200 నుంచి మొదలై రూ.13 వేల వరకు ధరలు ఉన్నాయి. కాగా ఇప్పుడు అనిరుధ్ షోలకు హై డిమాండ్ ఉన్న నేపథ్యంలో ఈ రేట్లు రూ.1500 నుంచి మొదలై రూ. 20 వేల వరకు ఉండవచ్చని అనుకుంటున్నారు.

## యుద్ధంలో ప్రణయం



జూనియర్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ప్రధానపాత్రల్లో అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్న చిత్రం ‘వార్ 2’. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచేశాయి. తాజాగా, ఫస్ట్ సింగిల్ గురించి అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ‘ఆవన్ జావన్’ అంటూ సాగే ఈ పాటను ఈ వారంలోనే విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఇది ‘బ్రహ్మాస్త్ర’లోని ‘కేసరియా’ (కుంకుమలా నువ్వే) పాట కంటే మరింత ఆకట్టుకుంటుందని చెప్పారు. హృతిక్ రోషన్, కియార అడ్వానీపై చిత్రీకరించిన ఈ రొమాంటిక్ సాంగ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని అన్నారు. ఆదిత్య చోప్రా నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు వస్తోంది.

## పాయల్ రాజ్‌పుత్ ఇంట తీవ్ర విషాదం..

## ఆమె తండ్రి కన్నుమూత




టాలీవుడ్ హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ ఇంట విషాదం నెలకొంది. ఆమె తండ్రి ‘విమల్ కుమార్ రాజ్ పుత్ (68) ( కన్నుమూశారు. గత కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధ పడుతున్న ఆయన చికిత్స పొందుతూ ఈ నెల 28న సాయంత్రం హైదరాబాద్‌లో తుది శ్వాస విడిచారు. కుటుంబ సభ్యుల సమక్షంలో అంత్యక్రియలు ఈ రోజు (జూలై 30న) ఢిల్లీలో నిర్వహించనున్నారు.పాయల్ రాజ్‌పుత్ తన తండ్రితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ.. ‘‘నా పక్కన లేకపోయినా, మీ ప్రేమ నన్ను ప్రతిరోజూ నడిపిస్తుంది. మీ చిరునవ్వు, మీ గొంతు, మీ ఉనికి నాకు చాలా గుర్తుంది. మీరు ఈ ప్రపంచం నుండి వెళ్ళిపోవచ్చు, కానీ నా హృదయం నుండి ఎప్పటికీ వెళ్ళిపోరు. లవ్ యు నాన్న..’’ అంటూ పోస్టు చేసింది.ఇదిలాఉంటే.. కార్తికేయ హీరోగా అజయ్ భూపతి తెరకెక్కించిన ‘ఆర్.ఎక్స్. 100’ (%=శ% 100) సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన పాయల్ రాజ్ పుత్ ఆ సినిమా ఘన విజయం సాధించడంతో ఓవర్ నైట్ స్టార్ హీరోయిన్ అయిపోయింది. ఆ తర్వాత వరుసగా ఆమెకు పలు అవకాశాలు వచ్చాయి. దాంతో హైదరాబాద్ లోనే పాయల్ స్థిరపడింది. ఈ క్రమంలో తెలుగులో %=శ% 100, వెంకీ మామ, మంగళవారం, ఆర్డీఎక్స్ లవ్, రక్షణ, డిస్కో రాజా, జిన్నా వంటి చిత్రాలతో పాటు 3 రోజెస్ అనే వెబ్ సిరీస్‌తో టాలీవుడ్‌లో మంచి గుర్తింపును దక్కించుకుంది.ప్రస్తుతం ఆమె ముని దర్శకత్వంలో తెరకెక్కుతున్న వెంకటలచ్చిమి అనే సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది.

## సంజూ బాబా లుక్కొచ్చింది



ప్రభాస్ హీరోగా మారుతి తెరకెక్కిస్తున్న హారర్ థ్రిల్లర్ ‘రాజాసాబ్’. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ ఓ కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. మంగళవారం ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా చిత్రంలో ఆయన పోషిస్తున్న లుక్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ‘విలక్షణతకు, ఎనర్జీకి పర్యాయపదమైన సంజూ బాబాకు పుట్టిన రోజు శుభాకాంక్షలు’ అని పేర్కొంది. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచేసింది. డిసెంబర్ 5న చిత్రం విడుదలవుతోంది.

## గజని, తుపాకీ తరహాలో.. మదరాసి




శివకార్తికేయన్ హీరోగా రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా తాను రూపొందిస్తున్న ‘మదరాసి’ సినిమా తనకు ఒక కమ్‌బ్యాక్ మూవీగా ఉంటుందని ఆ చిత్ర దర్శకుడు ఏఆర్.మురుగదాస్ గట్టి విశ్వాసం వ్యక్తం చేశారు. ఆయన హిందీలో సల్మాన్ ఖాన్ హీరోగా తెరకెక్కించిన ‘సికిందర్’ మూవీ బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. దీంతో ‘మదరాసి’ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. దీనిపై దర్శకుడు మురుగదాస్ మాట్లాడుతూ, ‘ఈ మూవీ ఖచ్చితంగా నాకు ఒక కమ్‌బ్యాక్‌లా ఉంటుందన్నారు. %సూర్య నటించిన ‘గజని’ సినిమా స్క్రిప్టు, విజయ్ ‘తుపాకీ’మూవీ యాక్షన్ సమ్మేళనంతో ఈ మూవీని రూపొందిస్తున్నాను. అందుకే ఈ సినిమా అభిమానులకు సరికొత్త అనుభూతినిస్తుంది. ‘మదరాసి’ అనే పదాన్ని ఉత్తర భారతదేశంలో అత్యధికంగా ఉపయోగిస్తారు. ముఖ్యంగా తమిళులను ఉద్దేశించి ఈ పదం వాడుతారు. తద్వారా ఏర్పడే సమస్యలు ఏంటో ఇందులో చూపించాం.పైగా ‘గజిని’ మూవీలో హీరో సూర్యకు ఉన్నట్టుగానే ఇందులో శివకార్తికేయన్‌కు ఒక మానసిక సమస్య ఉంటుంది. ఈ సమస్యలను హీరో ఎలా అధిగమించారన్నదే ఈ చిత్ర మూలకథ’ అన్నారు.

## అందరినీ ఆకట్టుకుంటుంది



జగదీశ్ ఆమంచి కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తోన్న చిత్రం ‘యముడు’. ‘ధర్మో రక్షతి రక్షితః’ దీని ట్యాగ్‌లైన్. శ్రావణి శెట్టి కథానాయిక. ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమంలో నిర్మాత బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ ‘ఈ మధ్య విడుదలవుతున్న చిన్న చిత్రాలు అద్భుతాలు సృష్టిస్తున్నాయి. ఈ ‘యముడు’ చిత్రం కూడా విజయవంతం అవుతుందనే నమ్మకం ఉంది’ అ

టుడే స్పోర్ట్స్

# కుల్దీప్ అర్ష్‌దీప్ ఖరారేనా




లండన్: వీరోచిత పోరాటంతో నాలుగో టెస్టును డ్రా చేసుకొన్న భారత్.. సిరీస్ ఆశలను సజీవంగా నిలబెట్టుకొంది. గురువారం నుంచి ఓవల్‌లో జరిగే ఐదో, ఆఖరి టెస్ట్‌లో గెలిచి సిరీస్‌ను సమం చేయాలన్న పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో టీమిండియా తుది జట్టు కూర్పు ఆసక్తిగా మారింది. అయితే, పరిస్థితులను బట్టి ఊహించిన దానికంటే ఎక్కువ మార్పులు చోటు చేసుకొనే అవకాశం ఉందని సమాచారం. ముఖ్యంగా వికెట్లు పడగొట్టగల బౌలర్ కోసం భారత్ వెదుకుతోంది. స్టార్ పేసర్ బుమ్రా విషయం సస్పెన్స్‌గా మారింది. మాంచెస్టర్ టెస్ట్‌లో పేస్ తగ్గించి బౌలింగ్ చేయడంతో అతడి ఫిట్‌నెస్‌పై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కానీ, బుమ్రా బౌలింగ్ చేసేంత ఫిట్‌గా ఉన్నాడని బ్యాటింగ్ కోచ్ సితాన్షు కొటక్ చెప్పాడు. కానీ, టీమ్ మేనేజ్‌మెంట్ మాత్రం మ్యాచ్ ముందు మాత్రమే బుమ్రాపై ఓ నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. నాలుగు టెస్ట్‌ల్లో కలిపి బుమ్రా దాదాపు 120 ఓవర్లు బౌల్ చేశాడు. ఒక్క ఓల్డ్ ట్రాఫోర్డ్‌లోనే 33 ఓవర్లు వేశాడు. ఒకవేళ బుమ్రాకు విశ్రాంతినిస్తే.. అతడి స్థానాన్ని ఎవరితో భర్తీ చేయాలనేది పిచ్ పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది. కాగా, స్పెషలిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను గత నాలుగు మ్యాచ్‌లూగా బెంచ్‌కే పరిమితం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అతడికి ఆఖరి టెస్ట్‌లో ఆడించడం ఖాయంగా భావిస్తున్నారు. గాయపడిన పేసర్లు అర్ష్‌దీప్, ఆకాశ్‌దీప్ కూడా ఫిట్‌నెస్ సాధించారని కోచ్ గంభీర్ తెలిపాడు. అయితే, అన్షుల్ కాంబోజ్, శార్దూల్ ఠాకూర్‌పై వేటు పడుతుందన్న ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి.కాంబోజ్ స్థానంలో ఆకాశ్‌దీప్ రీఎంట్రీ ఇవ్వనుండగా.. బుమ్రా దూరమైతే ఆ స్థానం కోసం అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ పోటీలో ఉన్నారు. అయితే అర్ష్‌దీప్ ఎంపిక దాదాపు ఖరారైనట్టే చెబుతున్నారు. ఇక శార్దూల్ బంతితో తీవ్రంగా నిరాశపర్చడం.. కుల్దీప్‌కు మార్గం సుగమం చేసిందని భావిస్తున్నారు. బ్యాటింగ్ విభాగంలో పెద్దగా మార్పులు లేవని తెలుస్తోంది. గాయపడిన రిషభ్ పంత్ సిరీస్ నుంచి అవుట్ కాగా.. అతడి స్థానంలో ధ్రువ్ జురెల్ ఆడడం దాదాపుగా ఖరారైంది.

# భారత్‌కు కఠిన డ్రా



న్యూఢిల్లీ: వచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో జరిగే మహిళల ఫుట్‌బాల్ ఆసియాకప్‌లో భారత జట్టుకు కఠిన డ్రా ఎదురైంది. 12 జట్లు పాల్గొనే ఈ టోర్నీలో భారత్ గ్రూప్ 'సి'లో తలపడనుంది. అయితే ఇందులో తమకంటే మెరుగైన ర్యాంకింగ్స్‌లో ఉన్న జపాన్, చైనీస్ తైపీ, వియత్నాం జట్లు కూడా చోటు దక్కించుకున్నాయి. మార్చి ఒకటి నుంచి 21 వరకు ఈ ఆసియాకప్ జరుగుతుంది. ఇందులో సెమీసకు చేరిన నాలుగు జట్లు నేరుగా 2027 ఫిఫా మహిళల వరల్డ్‌కప్‌నకు అర్హత సాధిస్తాయి.

# భారత్ పాక్ జట్లు ఆడతాయి




న్యూఢిల్లీ: వచ్చే నెలలో జరగాల్సిన ఆసియాకప్ టీ20 టోర్నీపై ఇటీవలి వరకు సందిగ్ధత కొనసాగింది. అయితే ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) షెడ్యూల్‌ను ప్రకటించడంతో అందరి సందేహాలు తీరాయి. సెప్టెంబరు 9 నుంచి 28 వరకు తటస్థ వేదిక దుబాయ్‌లో ఈ టోర్నీ జరగనుంది. ఒకే గ్రూపులో ఉన్న భారత్-పాక్ జట్లు అదే నెల 14న మ్యాచ్‌లో తలపడతాయి. కానీ పహల్గాం ఉగ్రదాడుల తర్వాత కూడా పాక్‌తో మ్యాచ్ ఆడడమేంటన్న విమర్శలు సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో బీసీసీఐ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే ఆసక్తి వ్యక్తమవుతోంది. అటు జాతీయ క్రీడా బిల్లు ఇంకా ఆమోదం పొందలేదు కాబట్టి బోర్డు క్రీడా మంత్రిత్వ శాఖ పరిధిలోకి రాదని, ప్రజల మనోభావాలపై వారు ఎలా స్పందిస్తారో చూడాల్సిందేనని క్రీడా శాఖ వర్గాలు తెలిపాయి. మరోవైపు ఆసియాకప్‌లో పాక్‌తో మ్యాచ్‌ను ఆడకుంటే భారత్‌కే నష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే ఇది ద్వైపాక్షిక సిరీస్ కాదు కాబట్టి వాకోవర్ ఇస్తే కీలక పాయింట్లు కోల్పోవాల్సి ఉంటుందని, అది పాక్‌కే లాభిస్తుందని చెబుతున్నారు. అందుకే ఈ మ్యాచ్ రద్దు కాకపోవచ్చని తేల్చారు. అంతేకాకుండా ఈ రెండు జట్లు తలపడితే వ్యాపార పరంగా భారీ ఆదాయం చేకూరుతుందని, కానీ రద్దయితే బ్రాడ్‌కాస్టర్‌కే కాకుండా ఇతర ఏసీసీ సభ్య దేశాలకు కూడా ఆర్థికంగా నష్టం చేకూరినట్టేనని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

# కేకేఆర్ కోచ్‌కు ఉద్వాసన



న్యూఢిల్లీ: చీఫ్ కోచ్ చంద్రకాంత్ పండిట్‌కు ఐపీఎల్ టీమ్ కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) ఉద్వాసన పలికింది. ఈ ఏడాది ఐపీఎల్‌లో పేలవ ప్రదర్శన నేపథ్యంలో సహాయ సిబ్బందిని ప్రక్షాళన చేయాలని కోల్‌కతా యాజమాన్యం నిర్ణయించింది. 2024లో పండిట్ హయాంలో కేకేఆర్ దశాబ్దం తర్వాత ఐపీఎల్ టైటిల్ గెలిచింది. కానీ, ఆ తర్వాతి సీజన్‌లో ఘోర ప్రదర్శనతో కేవలం ఐదు విజయాలతో ఎనిమిదో స్థానంలో నిలిచింది. మెకల్లమ్ స్థానంలో 2022లో కేకేఆర్ కోచ్‌గా చంద్రకాంత్ బాధ్యతలు చేపట్టాడు. పండిట్ కఠిన వ్యవహారశైలి కారణంగా కొందరు విదేశీ ప్లేయర్లు అసహనం వ్యక్తం చేశారు.

# ప్రీక్వార్టర్స్‌కు సాత్విక్ ద్వయం



మకావు: సాత్విక్-చిరాగ్ జోడీ మకావు ఓపెన్‌లో ప్రీక్వార్టర్స్‌కు చేరుకోగా.. గాయత్రి జంటకు తొలి రౌండ్‌లోనే షాక్ తగిలింది. పురుషుల డబుల్స్‌లో మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో రెండో సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జంట 21-13, 21-15తో మలేసియాకు చెందిన లో హాంగ్ యి-ఎన్‌జి ఇంగ్ చియాంగ్‌పై సునాయాసంగా గెలిచింది. కాగా, మహిళల డబుల్స్‌లో టాప్ సీడ్ గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ జంట 21-16, 20-22, 15-21తో చైనీస్ తైపీకి చెందిన లింగ్ గ్జియో మిన్-పెంగ్ యు వి చేతిలో ఓడింది..టాప్-10లోకి సాత్విక్ జోడీ..: బీడబ్ల్యూఎఫ్ పురుషుల డబుల్స్ ర్యాంకింగ్స్‌లో సాత్విక్ జోడీ మళ్లీ టాప్-10లోకి దూసుకొచ్చింది. తాజా ర్యాంకింగ్ జాబితాలో సాత్విక్-చిరాగ్ జంట మూడు స్థానాలు మెరుగుపర్చుకొని 9వ ర్యాంక్‌లో నిలిచింది. సింగిల్స్‌లో లక్ష్య సేన్ రెండు ర్యాంకులు మెరుగుపర్చుకొని 17వ స్థానంలో, ప్రణయ్ 33వ ర్యాంక్‌లో ఉన్నారు. పీవీ సింధు 15వ ర్యాంక్‌లో నిలకడగా కొనసాగుతుండగా..

# మంధాన వెనక్కి బ్రంట్ ముందుకు



దుబాయ్: అంతర్జాతీయ మహిళల వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో స్మృతి మంధాన తన అగ్రస్థానాన్ని కోల్పోయింది. మంగళవారం ఐసీసీ ప్రకటిం చిన తాజా జాబితాలో ఇంగ్లండ్ కెప్టెన్ నాట్ సివర్ బ్రంట్ టాప్‌లోకి వెళ్లింది. భారత్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో బ్రంట్ 160 పరుగులతో ఫామ్‌ను చాటుకుంది. అటు మంధాన ర్యాంకు రెండో స్థానానికి తగ్గింది. భారత కెప్టెన్ హర్మన్ ప్రీత్ పది స్థానాలను మెరుగుపర్చుకుని 11కి, జెమీమా 13వ స్థానానికి చేరారు. బౌలింగ్ విభాగంలో స్పిన్నర్ సోఫీ ఎకెల్‌స్టోన్ టాప్‌లో కొనసాగుతోంది.

# పిచ్ క్యూరేటర్‌తో వాగ్వాదం.. గంభీర్ కోపానికి కారణం అదేనట..



టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఓవల్ పిచ్ క్యూరేటర్ లీ ఫోర్టిస్ మధ్య వాగ్వాదం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. 'నువ్వు ఇక్కడ కేవలం మైదాన సిబ్బందివి మాత్రమే. మాకు నువ్వేం చెప్పనక్కర్లేదు. ఏం చేయాలో మాకు తెలుసు. కావాలంటే మీ అధికారులకు ఫిర్యాదు చేసుకో' అంటూ గంభీర్ పిచ్ క్యూరేటర్‌ను హెచ్చరించాడు. ఆ సమయంలో టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కొటక్ కలుగచేసుకుని పిచ్ క్యూరేటర్‌ను కాస్త దూరంగా తీసుకెళ్లి సముదాయించాడు. అయినప్పటికీ గంభీర్, క్యూరేటర్ మధ్య వాగ్వాదం కొనసాగింది.ఆ ఇద్దరి మధ్య ఏం జరిగిందో టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కొటక్ వెల్లడించాడు. 'ఆటగాళ్లతో గంభీర్ ప్రాక్టీస్ చేయిస్తుండగా లీ ఫోర్టిస్ అక్కడకు వచ్చాడు. బ్యాటర్ మినహా మిగతా వారంతా వికెట్‌కు 2.5 మీటర్ల దూరంలో ఉండాలని చెప్పాడు. రోప్ బయటకు వెళ్లండి అని గ్రౌండ్ సిబ్బంది వచ్చి ఆటగాళ్లను హెచ్చరించడం నేను ఇప్పటివరకు వినలేదు. అందుకే గంభీర్‌కు కోపం వచ్చింది. ఈ ఘటనపై టీమిండియా ఎలాంటి ఫిర్యాదూ చేయలేదు' అని సితాన్షు వివరించాడు.ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా జరగాల్సిన చివరి మ్యాచ్ లండన్‌లోని ఓవల్ మైదానంలో గురువారం నుంచి ప్రారంభం కావాల్సి ఉంది (%×అస జం జుఅస్త్ర%). దీంతో ఆటగాళ్లు ముమ్మరంగా ప్రాక్టీస్ చేస్తున్నారు. కాగా, గంభీర్ ప్రవర్తనపై ఓవల్ మైదానం సిబ్బంది ఇంగ్లండ్ క్రికెట్ బోర్డుకు ఫిర్యాదు చేయబోతున్నట్టు తెలుస్తోంది. ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా ఇప్పటివరకు జరిగిన నాలుగు టెస్ట్ మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్ 2-1తో ఆధిక్యంలో ఉంది. చివరి టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా విజయం సాధిస్తే సిరీస్ డ్రా అవుతుంది.

# ఆసీస్ క్లీన్‌స్వీప్




సెయింట్ కిట్స్: వెస్టిండీస్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను పర్యాటక ఆస్ట్రేలియా 5-0తో క్లీన్‌స్వీప్ చేసింది. సోమవారం రాత్రి జరిగిన ఐదవ, ఆఖరి టీ20లో ఆసీస్ 3 వికెట్ల తేడాతో విండీస్‌ను చిత్తు చేసింది. తొలుత విండీస్ 19.4 ఓవర్లలో 170 పరుగులకు ఆలౌటైంది. హెట్‌మయెర్(52), షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (35) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. బెన్ డ్వార్షుయిస్ మూడు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో ఆసీస్ 17 ఓవర్లలో 173/7 స్కోరు చేసి గెలిచింది. మిచెల్ ఓవెన్ (37), కామెరూన్ గ్రీన్ (32), టిమ్ డేవిడ్ (30) వేగంగా ఆడారు. అకీల్ హొస్సేన్ 3 వికెట్లు పడగొట్టాడు.

# టుడే బిజినెస్

## శ్రావణ మాసంలో శుభవార్త..
## బంగారం, వెండి ధరల్లో ఊహించని తగ్గింపు!




%దేశంలో బంగారం, వెండి కొనుగోలు చేయాలని చూస్తున్న వారికి శుభవార్త వచ్చేసింది. పసిడి ధరలు నిన్నటి రేట్లతో పోలిస్తే తగ్గుముఖం పట్టగా, వెండి ధరలు మాత్రం స్థిరంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో జూలై 30, 2025న ఉదయం 6:10 గంటల సమయానికి, గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.99,810గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.91,490గా నమోదైంది. వెండి ధర కిలోకు రూ.1,15,900 వద్ద స్థిరంగా ఉంది.

## ఇలా ఇన్వెస్ట్ చేయండి..రెండేళ్లలోనే రూ. 10 లక్షలు పొందండి..




మీరు తక్కువ సమయంలోనే పెద్ద మొత్తంలో డబ్బు పొందాలని చూస్తున్నారా. అందుకోసం ఓ చక్కటి ప్లాన్ ఉందని ఆర్థిక నిపుణులు తెలిపారు. దీని ప్రకారం మీరు రెండేళ్లలోనే రూ.10 లక్షలు పొందవచ్చు. అది ఎలా అనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం. మీరు కొత్త కారు కొనుగోలు, పెళ్లి ఖర్చులు లేదా అత్యవసర నిధులు ఏర్పాటు చేసుకోవడం కోసం ఈ మొత్తాన్ని వినియోగించుకోవచ్చు.రెండు సంవత్సరాల్లో రూ. 10 లక్షలు రాబట్టడం కొంచెం కష్టం అనిపించవచ్చు. కానీ సరైన ప్లానింగ్, డిసిప్లిన్‌తో మీరు ఈ లక్ష్యాన్ని చేరుకోవచ్చు. దీని కోసం మీరు నెలకు రూ. 40,000 ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది.

1. మ్యూచువల్ ఫండ్ %వా×ూ%లలో పెట్టుబడి
నెలసరి పెట్టుబడి: రూ. 20,000
సాదారణ రాబడులు: దాదాపు 12%
మొత్తం పెట్టుబడి: రూ. 4.8 లక్షలు (రెండేళ్లకు)
వచ్చే రాబడి : రూ. 61,300
మొత్తం విలువ: దాదాపు రూ. 5.41 లక్షలు
మ్యూచువల్ ఫండ్లలో రాబడులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. ఇవి మార్కెట్‌కు సంబంధించినవి కావడంతో కొంత హెచ్చుతగ్గులు అయ్యే ఛాన్సుంది. అందుకే దీర్ఘకాలిక దృష్టితో ఇన్వెస్ట్ చేస్తే రిస్క్ తక్కువగా ఉంటుంది.

2. బంగారంపై పెట్టుబడి
నెలసరి పెట్టుబడి: రూ. 20,000
ఊహించదగిన రాబడి: సుమారుగా 10%
మొత్తం పెట్టుబడి: రూ. 4.8 లక్షలు (రెండేళ్లకు)
వచ్చే లాభం అంచనా: రూ. 50,903
మొత్తం విలువ: దాదాపుగా రూ. 5.31 లక్షలు
బంగారం సురక్షితమైన పెట్టుబడి సాధనంగా గుర్తింపు పొందింది. దీని ధరలలో కొంత హెచ్చుతగ్గులు ఉండవచ్చు కానీ దీర్ఘకాలంలో లాభాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. డిసిప్లిన్‌తో పెట్టుబడి ఒక్కోసారి ఖర్చులు పెరగవచ్చు. అయినా సరే, ప్రతినెలా డబ్బు సేవ్ చేయడంలో క్రమశిక్షణ పాటించాలి. దీనికోసం మీ బ్యాంక్ అకౌంట్ నుంచి ఆటో డెబిట్ సెటప్ చేసుకోవాలి.మార్కెట్ మార్పులకు భయపడకండి మార్కెట్ తాత్కాలికంగా పడిపోతే భయపడవద్దు. వెంటనే ఇన్వెస్ట్‌మెంట్లను తీసేయకండి. ఇది సాధారణమే. కానీ మీరు పెట్టుబడి చేసిన స్కీములు కచ్చితంగా మంచి ఫలితాలను అందిస్తాయి.

## ఇండియాపై 25 శాతం సుంకం విధిస్తామన్న ట్రంప్.. ఇంకా ఖరారు కానీ ఒప్పందం




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ( మరోసారి భారతదేశంపై సుంకాల హెచ్చరికలు జారీ చేశారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరపకపోతే, భారతీయ ఉత్పత్తులపై 25 శాతం సుంకం విధిస్తామని (%×అఽఋ ఖూ ుతీఋఽవ ఋౌతీ%) ఆయన ప్రకటించారు. ఆగస్టు 1 గడువు ముందు రెండు దేశాల మధ్య చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ సుంకం ఇంకా ఖరారు కాలేదని అమెరికా వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్ స్పష్టం చేశారు. ఈ అంశం భారత్–అమెరికా వాణిజ్య సంబంధాలపై మరోసారి చర్చనీయాంశంగా మారింది.ట్రంప్ గతంలో డజనుకు పైగా దేశాలకు లేఖల ద్వారా సుంకాల హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, ఈసారి భారత్‌పై లిఖిత హెచ్చరిక మాత్రం ఇంకా జారీ చేయలేదు. గతంలో, ఏప్రిల్ 2న భారతీయ దిగుమతులపై 26 శాతం సుంకం విధించిన ట్రంప్, ఇప్పుడు 25 శాతం సుంకం విధించే అవకాశం ఉందని సూచించారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందం గురించి చర్చించాలని, లేకపోతే కఠిన సుంకాలు తప్పవని ఆయన ప్రపంచ దేశాలను కోరారు. భారత్ మా స్నేహితుడు, కానీ వాణిజ్యంలో సరైన వైఖరి అవసరమని ట్రంప్ స్పష్టం చేయడం విశేషం.

## రియల్టీతో బ్యాంకుల రుణానుబంధం




న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ రంగానికి బ్యాంకుల రుణ విత రణ గత నాలుగేళ్లలో రెట్టింపై 2025 మార్చి నాటికి రూ.35.4 లక్షల కోట్లకు చేరింది. రియల్టీ కన్సల్టెంట్ కోలియెర్స్ తాజా నివేదికలో ఈ విషయం తెలిపింది. రియల్టీ రంగంలో కార్యకలాపాలు సాగిస్తున్న టాప్ 50 లిస్టెడ్ కంపెనీల లాభదాయకత, అవి ప్రదర్శిస్తున్న వేగం, మార్కెట్లో వాటి స్థాయి వంటి వి మదింపు చేసి ఈ నివేదిక రూపొందించినట్లు కోలియెర్స్ తెలిపింది. 2021 ఆర్థిక సంవత్సరంలో రియల్టీ రంగానికి స్థూల బ్యాంకు రుణాలు రూ.17.8 లక్షల కోట్లుండగా ఈ ఏడాది మార్చి నాటికి రూ.35.4 లక్షల కోట్లకు చేరినట్టు తెలియచేసింది. తీవ్ర ఆటుపోట్ల మధ్యన కూడా ఈ రంగం ఆర్థిక స్వస్థత ఎంతగానో మెరుగుపడిందని, ఆర్థిక రంగంలోని ఇత ర విభాగాల కన్నా మెరుగైన పనితీరు ప్రదర్శిస్తోందని పేర్కొంది. బ్యాంకులు అందిస్తున్న మొత్తం రుణాల్లో సుమా రు ఐదింట ఒక శాతం రియల్టీ రంగానికే అందుతున్నట్టు తెలిపింది. ఇతర రంగాల్లోని కంపెనీలతో పోల్చితే పరపతి రేటింగ్ పెంచుకున్న కంపెనీల్లో రియల్టీ రంగానికి చెందినవే అధికంగా ఉన్నట్టు కోలియెర్స్ సీఈఓ బాదల్ యాజ్ఞిక్ అన్నారు. 2025 ఆర్థిక సంవత్సరంలో టాప్ 50 కంపెనీల్లో 62 కంపెనీల లాభదాయకత పెరిగిందని, 60 శాతం పైగా కంపెనీల రుణభార స్థాయిలు కూడా సౌకర్యవంతంగా ఉన్నాయని ఆయన చెప్పారు.రాబోయే ఆరు నెలల కాలానికి దేశీయ ప్రాపర్టీ మార్కెట్ వృద్ధిపై రియల్ ఎస్టేట్ డెవలపర్లు, ఆర్థిక సంస్థలు ఆశావహ దృక్పథంతో ఉన్నట్టు నరెడ్కో, నైట్‌ఫ్రాంక్ అధ్యయనంలో తేలింది. మంగళవారం ఈ సంస్థలు 45వ ఎడిషన్ రియల్ ఎస్టేట్ సెంటిమెంట్ ఇండెక్స్‌ను విడుదల చేశాయి. నాలుగు త్రైమాసికాల పతన క్రమానికి స్వస్తి చెప్పిన ఈ సూచీ జనవరి–మార్చి త్రైమాసికంతో పోల్చితే ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో 54 పాయింట్ల నుంచి 56 పాయింట్లకు పెరిగింది. రియల్టీ రంగంలో పెరిగిన ఆశావహ వైఖరికి ఇది దర్పణమని నరెడ్కో ప్రెసిడెంట్ హరిబాబు అన్నారు.

## పీ అండ్ జీ పగ్గాలు భారతీయుడి చేతికి




న్యూఢిల్లీ: మరో ప్రముఖ బహుళజాతి కంపెనీకి భారతీయుడు సారథ్యం వహించనున్నారు. అమెరికన్ ఎఫ్ఎంసీజీ దిగ్గజం ప్రాక్టర్ అండ్ గాంబుల్ (పీ అండ్ జీ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా శైలేష్ జెజురికర్ నియమితులయ్యారు. 58 ఏళ్ల జెజురికర్ వచ్చే ఏడాది జనవరి 1 నుంచి కొత్త బాధ్యతలను చేపట్టనున్నారు. 1989లో ఈ కంపెనీలో అసిస్టెంట్ బ్రాండ్ మేనేజర్‌గా చేరిన శైలేష్.. అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చారు. గత ఆరేళ్లుగా కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ప్రముఖ లిఫ్టల తయారీ సంస్థ ఓటిస్ ఎలివేటర్స్ కంపెనీ బోర్డు సభ్యుడిగా కూడా కొనసాగుతున్నారు. నాయకత్వ మార్పులో భాగంగా పీ అండ్ జీ ప్రస్తుత సీఈఓ జాన్ మోల్లెర్ స్థానంలో శైలేష్ నియ మితులయ్యారు

## హైదరాబాద్‌లో బ్రిగేడ్ గ్రూప్ కొత్త ప్రాజెక్టులు

హైదరాబాద్ : ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ బ్రిగేడ్ గ్రూప్ హైదరాబాద్‌లో మరో రెండు లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాజెక్టులు చేపట్టింది. నగరంలోని మోతీనగర్ ప్రాంతంలో పది ఎకరాల్లో ఈ రెండు ప్రాజెక్టులు చేపట్టినట్టు తెలిపింది. ఈ గ్రూప్ ఇప్పటికే మోతీనగర్‌లో బ్రిగేడ్ సిటాడెల్ పేరుతో ఒక ప్రీమియం రెసిడెన్షియల్ ప్రాజెక్టు నిర్మిస్తోంది. దీనికి సమీపంలోనే బ్రిగేడ్ సిటాడెల్ 2, సిటాడెల్ 3 పేరుతో 10 లక్షల ఎస్ఎఫ్‌టీలో మరో రెండు రెసిడెన్షియల్ ప్రాజెక్టులు చేపడుతోంది.

## 3 రోజుల తర్వాత లాభాల్లోకి



ముంబై: మూడు రోజుల వరుస నష్టాల నుంచి స్టాక్ మార్కెట్‌కు కాస్త ఊరట లభించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి దిగ్గజ షేర్లలో కొనుగోళ్లతో మార్కెట్ మంగళవారం మళ్లీ లాభాలబాట పట్టింది. ఒకదశలో 539 పాయింట్ల వరకు ఎగబాకిన సెన్సెక్స్.. చివరికి 446.93 పాయింట్ల లాభంతో 81,337.95 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 140.20 పాయింట్ల వృద్ధితో 24,821.10 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 19 లాభపడగా.. రిలయన్స్ షేరు 2.21 శాతం పెరిగి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది.4 నెలల కనిష్ఠానికి రూపాయి: భారత కరెన్సీ విలువ నాలుగు నెలలకు పైగా కనిష్ఠ స్థాయికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 21 పైసల నష్టంతో రూ.86.91 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా డాలర్ బలపడటంతోపాటు ముడిచమురు ధరల పెరగుదల మన కరెన్సీపై ఒత్తిడి పెంచింది.టీసీఎస్ షేరు మరింత పతనం: 12,000 మంది ఉ ద్యోగులను తొలగిస్తున్నట్లు గత వారాంతంలో ప్రకటించిన టీసీఎస్ షేరు విలువ మరో 0.73 శాతం తగ్గింది. క్రితం సెషన్‌లో దాదాపు 2 శాతం జారుకుంది. దాంతో గడిచిన రెండు రోజుల్లో కంపెనీ షేరు ధర 2.48 శాతం క్షీణించగా.. మార్కెట్ విలువ రూ.28,148 కోట్లకు పైగా తగ్గి రూ.11.05 లక్షల కోట్లకు పరిమితమైంది.కళ్ల జోళ్ల విక్రయ కేంద్రాల నిర్వహణ స్టార్టప్ లెన్స్‌కార్ట్ కూడా ఐపీఓ జారీకి అనుమతి కోరుతూ సెబీకి దరఖాస్తు చేసింది. ఇష్యూ ద్వారా 100 కోట్ల డాలర్ల (సుమారు రూ.8,650 కోట్లు) వరకు సమీకరించే అవకాశం ఉందని బ్లూంబర్గ్ కథనం వెల్లడించింది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006